RNI No. TEL/TEL/2018/76342

లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY

సామాజిక, రాజకీయ దిన పత్రిక

ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్

మెదక్ ,మెదక్ జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీలు 148 పోలింగ్ కేంద్రాలలో ఉదయం ఏడు గంటలకు ప్రశాంతంగా పోలింగ్ ప్రారంభమైందని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా 18 వ వార్డులో ఆయన సతీమణితో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఐదో వార్డులో అదనపు కలెక్టర్ నాగేష్, అదనపు ఎస్పీ మహేందర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రతి ఒక్క ఓటరు పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.. ఈ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 686 మంది పోలీస్ సిబ్బంది తో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు..

ప్రచురణ : నిజామాబాద్ గురువారం, 12-02-2026 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 08 సంచిక : 350 పేజీలు : 8 వెల : రూ 2-00

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
ప్రపంచంలోనే మేటి నగరాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు
2047 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం
మధిర లో ఓటు వేసిన అనంతరం మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

మధిర,రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజాస్వామ్య పండుగ లో విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని తొమ్మిదవ వార్డులో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయి ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదేందుకు ఇబీతీవ ఫ్యూర్, రేర్ కోర్ అర్బన్, ఫెరి అర్బన్, రూరల్ అగ్రికల్చర్ ఎకానమీ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు. మిశ్రమలు విద్య వైద్యం మౌలిక వసతుల మేలు కలయిక ఈ ప్రణాళికలో ఉంటుందని తెలిపారు. ఎయిర్ ఇండెక్స్ సూచిక 250 దాటుతుంది ఢిల్లీ కలకత్తా వంటి నగరాల్లో నివసించడమే కష్టం అవుతుంది ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గాలి నాణ్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లలో ఆదాయం కోల్పోతున్నప్పటికీ బ్యాటరీ వివాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో మురుగునీటిని శుభ్రం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఎస్టిపిలను నిర్మాణం చేస్తున్నామన్నారు. చెరువుల ను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఉత్పత్తికి ప్రధానమైన విద్యుత్తు సరఫరాలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ?200 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేద్కర్ నాలెడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో దేశంలోని ప్రముఖ లెక్చరర్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. స్కిల్స్ ఉంటేనే ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయి అందుకే నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు నెలకొల్పామని తెలిపారు. పేద బిడ్డలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో నిర్మిస్తున్నామని అన్నారు . నిన్ను లేని పేదలకు 5 లక్షల రూపాయలతో ఇంద్ర మా ఇల్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్..

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. బుధవారం సాయంత్రం 5 లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరిగింది. ఈ నెల 13న మున్సిపల్, కార్పొరేషన్ల ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 13న ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 136 కేంద్రాల్లో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇప ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరుగుతుంది. అదే రోజున కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లకు ఎన్నిక జరుగుతుంది.

ఓటు హక్కు వినియోగించుకున్న సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాల్లో పోలింగ్ జరుగుతోంది. మొత్తం 8,191 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరుగుతోంది. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కొడంగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నాయి. అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. 13న ఓట్ల లెక్కింపు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉత్కంఠకు తెరపడనున్నది. ఈనెల 16వ తేదీన 116 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక, 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉండనుంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు 4,150 మందిని బైండోవర్ చేయగా, 1,183 లైసెన్స్ ఆయుధాలను జమ చేసుకున్నారు. గత నెల 27న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత మంగళవారం సాయంత్రం వరకు రూ.1,19,68,200 విలువైన నగదు జప్తు చేశారు. నగలు, నగదు, మద్యం, మత్తుపదార్థాలు, ట్యాబ్‌లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలతో పాటు ఆమ్ ఆద్మీ, బిఎస్‌పి, ఎఐఎంఐఎం, టిడిపి, వైఎస్ఆర్‌సిపితోపాటు పలు ఇతర రిజిష్టర్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా పార్టీల నుంచి పోటీ చేసిన రెబల్స్, స్వతంత్రుల్లో కొంతమంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా, ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల అగ్రనేతలు ఈ ఎన్నికలకు ప్రతిష్టాత్మకంగా తీసుకుని హోరాహోరీ ప్రచారం నిర్వహించారు.

నిజామాబాద్ లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్, ఫిబ్రవరి 11 (లోకంతీరు): నిజామాబాద్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా కొనసాగింది. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో అన్ని చోట్ల పోలింగ్ మంగళవారం ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు చేరుకోవడం ప్రారంభించారు. ఉదయం 9.00 గంటల సమయానికి సగటున 8.25 శాతం పోలింగ్ నమోదయ్యింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 6.49 శాతం, ఆర్మూర్ లో 11.05 శాతం, బోధన్ లో 14.24 శాతం, భీంగల్ లో 9.38 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉదయం 11 గంటల సమయానికి సగటు పోలింగ్ 22.54 శాతం జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18.94 శాతం, ఆర్మూర్ లో 29.60 శాతం, బోధన్ లో 32.35 శాతం, భీంగల్ లో 31.09 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఓటింగ్ అనూహ్యంగా పుంజుకుంది. సగటున 39.68 శాతం ఓటింగ్ జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 35.49 శాతం, ఆర్మూర్ లో 47.93 శాతం, బోధన్ లో 50.69 శాతం, భీంగల్ లో 51.53 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి సగటున 48.55 శాతం ఓటింగ్ జరుగగా, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 43.18 శాతం, ఆర్మూర్ లో 60.07 శాతం, బోధన్ లో 61.77 శాతం, భీంగల్ లో 63.65 శాతం పోలింగ్ నమోదయ్యింది. కాగా, జిల్లా ఎన్నికల అధికారి, ఇలా త్రిపాఠి నిజామాబాద్ నగరంలోని ఎన్.ఎఫ్.ఎన్ స్కూల్, అర్సపల్లి పాఠశాల, మాలపల్లిలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, ఆర్మూర్ మున్సిపల్ పట్టణంలోని రాం మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, పెర్కిట్ లోని జిల్లా పరిషత్ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ లు, మెడికల్ క్యాంపు, వీల్ చైర్ ఇతర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? అని తనిఖీ చేశారు. కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును, స్థానిక పరిస్థితులను కలెక్టర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అబ్జర్వర్ సీహెచ్.సత్యనారాయణ రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కలెక్టర్ నేతృత్వంలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలోనూ ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తం 729 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎక్కడికక్కడ ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం, బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు ఐ.డీ కార్డు లేని పక్షంలో ఎన్నికల సంఘం ధృవీకరించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని విస్తృత ప్రచారం చేయడం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయించామని, వెబ్ క్యాస్టింగ్ జరిపించామని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారని అన్నారు. నిర్ణీత సమయం లోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించామని అన్నారు. ఈ నెల 13న ఉదయం 8.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి సైతం పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలన జరిపారు. ఓటింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి, పోలీసు బందోబస్తు మధ్యన స్ట్రాంగ్ రూమ్ లకు తరలించారు.

మున్సిపల్ ఎన్నికల పోరులో కాంగ్రెస్ దే హవా.....

నిజామాబాద్ ఫిబ్రవరి 11 (లోకంతీరు): మున్సిపల్ ఎన్నికల పోరులో కాంగ్రెస్ హవా కొనసాగించింది. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఏ విదంగా వచ్చాయో మున్సిపల్ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా రానున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిజామాబాద్ కార్పొరేషన్ తో పాటు ఆర్మూర్ ,బోధన్ , భీంగల్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. నిజామాబాద్ కార్పొరేషన్ తో పాటు బోధన్ , ఆర్మూర్ మిత్రపక్షమైనటువంటి ఎంఐఎం పార్టీతో అధికారంలో రానుంది. భీంగల్ లో మాత్రం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గం లో భీంగల్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవి కైవసం చేసుకుంది.లోకంతీరు తీరు సర్వేలో భాగంగా ఎగ్జిట్ పోల్స్ ను విడుదల చేయడం జరిగింది.

అవిశ్వాస తీర్మానం నోటీసులలో లోపాలు.. తిరస్కరణకు గురయ్యే అవకాశం..!

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ను పదవి నుంచి తప్పించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. అందులోభాగంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు మంగళవారం నోటీసులు అందజేశాయి. అయితే ఆ నోటీసులలో లోపాలు ఉన్నట్లు లోక్‌సభ వర్గాలు వెల్లడించాయి. కొన్ని సందర్భాలను ప్రతిపక్ష సభ్యులు పదేపదే అందులో ప్రస్తావించినట్లు తెలిపాయి.అయితే ఆ నోటీసును పూర్తిగా తిరస్కరించడానికి బదులుగా అందులోని లోపాలను సవరించాలని స్పీకర్ ఓం బిర్లా సెక్రటేరియట్‌ను ఆదేశించినట్లు సమాచారం. సవరించిన నోటీసు అందిన తర్వాత నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాటిని పరిశీలిస్తామని అధికారులు పేర్కొన్నారు. మార్చి 9న బడ్జెట్ సెషన్ రెండో దశ ప్రారంభమైన తర్వాత ఈ నోటీసును లిస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో పాల్గొనేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాల నేపథ్యంలో విపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టబోతున్నాయి

సంపాదకీయం

పాక్ యూ టర్న్ వెనుక...

రోజుకో మలుపు తిరిగిన భారత్ – పాకిస్థాన్ టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్ ఎట్టకేలకు జరగనుంది. బంగ్లాదేశ్‌తో మొదలైన ఈ వివాదం చిలికి చిలికి ఓ పెద్ద గాలివానలా మారింది. బంగ్లాదేశ్‌ను టీ20 వరల్డ్‌కప్ నుంచి బహిష్కరించిన తర్వాత భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమంటూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డు భీష్మించుకుని కూర్చుంది. పాక్ తీరు చూసి దాయాదుల పోరు జరగదేమో అని అందరూ అనుకున్నారు. కానీ ఓ అదృశ్య శక్తి ఎంట్రీతో పాక్ తోకముడవక తప్పలేదు. టీ ట్వంటీ ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న పాకిస్తాన్ చర్యపై ఆ దేశంలో విస్తృత చర్చ జరుగుతోంది. ఆ దేశపు క్రికెటర్లు అనేకమంది దీనిని 'పాక్ విజయం'గా చెప్పుకుంటున్నారు."ఈ నిర్ణయం తీసుకున్నందుకు శ్రీలంక అధ్యక్షుడు పాకిస్తాన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వాల జోక్యం వల్ల ఈ విషయం ఆట పరిధిని దాటి పోయింది. బంగ్లాదేశ్, ఇతర సభ్య దేశాల ప్రయోజనాల కోసం పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం అవసరం. ఎందుకంటే భారత్– పాక్ మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయంతో వాళ్లు కూడా ప్రయోజనం పొందుతారు" అని పాకిస్తాన్ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ జియోన్యూస్‌తో అన్నారు"మేము పరిణతితో కూడిన నిర్ణయం తీసుకున్నాం. ఈ టోర్నీలో బంగ్లాదేశ్‌కు ఎదురైన నష్టాలకు పరిహారం దక్కాలి. మా మిత్ర దేశాల కోసం మేము భారత్‌తో మ్యాచ్ ఆడుతున్నాం. మేము కావాలనుకుంటే ఆదాయంలో మా వాటా పెంచాలని డిమాండ్ చేయవచ్చు. కానీ మేమలా చేయలేదు. హుందాగా వ్యవహరించాం'' అని మరో క్రికెటర్ అహ్మద్ షాజాద్ అన్నారు. ఈ నిర్ణయంతో పాకిస్తాన్‌తోపాటు మిత్రదేశాల క్రికెట్‌కు వేలు జరుగుతుందని పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.''ఇప్పుడిక దీనిపై రాజకీయాలు అనవసరం. ఈ వ్యవహారాన్ని ఇక్కడితో ముగించాలి. మేమే గెలిచామని వాళ్లుగానీ, వీళ్లుగానీ చెప్పకూడదు" అని అహ్మద్ షాజాద్ చెప్పారు."భారత్‌కు మాతో సమస్య ఉంటే, మాతో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించేది. కానీ వాళ్లలా చేయలేదు. పాకిస్తాన్ మ్యాచ్ ఆడేలా ఐసీసీ ఒప్పించింది. అంటే పాక్ లేకుండా క్రికెట్ టోర్నీ నడవదని వారికి తెలుసు. క్రికెట్‌కు మా అవసరం ఉంది. మా మిత్ర దేశాల కోసమే మేమీ నిర్ణయం తీసుకున్నాం. ఇది మంచి నిర్ణయం. ఇందులో మేం గెలిచాం" అని పాక్ మాజీ క్రికెటర్ సికిందర్ బఖ్త్ అన్నారు. దీనిపై స్పందించిన బీసీసీఐ, సమస్యను పరిష్కరించడంలో ఐసీసీ పాత్రను కొనియాడింది."ఈ చర్చల ద్వారా బంగ్లాదేశ్ సెంటిమెంట్లను కూడా గౌరవించారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు కొంత ఉపశమనం లభించింది. వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారు. ఐసీసీ ప్రయత్నాలను వాళ్లు కూడా అభినందిచారు" అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నారు."బీసీసీఐ శక్తివంతమైన సంస్థ. అయినప్పటికీ అది పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మీద ఆధారపడుతోంది. భారత్‌తో మ్యాచ్ ఆడాలా వద్దా అనేది పాక్ క్రికెట్ బోర్డు నిర్ణయిస్తుంది. మ్యాచ్ ఆడకపోతే విధించే జరిమానా చెల్లించడానికి పాక్ క్రికెట్ బోర్డు దగ్గర డబ్బుల్లేవు. అందుకే పాక్ ఈ మ్యాచ్ ఆడేందుకు ఒప్పుకుంది. బీసీసీఐకి డబ్బులే ముఖ్యం" అని శివ సేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు."ఒక రకమైన డ్రామా నడుస్తోంది. కొన్నిసార్లు వాళ్లు భారత్‌తో మ్యాచ్ ఆడేది లేదంటారు. తర్వాత ఆడతామంటారు. అన్నీవాళ్ల సంతృప్తి కోసమే చేస్తారు. ఇప్పుడు బంగ్లాదేశ్, శ్రీలంక బతిమాలడంతో వాళ్లు ఒప్పుకున్నారు. భారత్ ఏ స్థాయిలో ఆధిపత్యం చలాయిస్తుందో ఇప్పుడు మనం ఐసీసీకి చూపించాం. అందుకే వాళ్లు ఇదంతా చేస్తున్నారు. దీనికి చికిత్స లేదు" అని భారత సీనియర్ క్రికెటర్ అతుల్ వాసన్ అన్నారు. టీ ట్వంటీ వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి15న భారత్‌తో ఆడాల్సిన మ్యాచ్ ఆడేందుకు పాక్ జట్టుకు అనుమతి ఇస్తూ ప్రధాని షాబాజ్ షరీఫ్ నిర్ణయం తీసుకున్నారు. మిత్రదేశాల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, ఐసీసీ ప్రతినిధులు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యుల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం గురించి ప్రధాని షాబాజ్ షరీఫ్‌కు పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ మొహిసిన్ నఖ్వి వివరించారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనలు, శ్రీలంక క్రికెట్ బోర్డు రాసిన లేఖలు, యూఏఈ, ఇతర సభ్య దేశాల సందేశాల ఆధారంగా పాకిస్తాన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని బీబీసీ ఉర్దూ తెలిపింది. భారత్‌తో మ్యాచ్ విషయంలో పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస నాయకే కృతజ్ఞతలు తెలిపారు. మరో వైపు కిస్థాన్ రోజుల వ్యవధిలోనే తన మనసు మార్చుకొని, భారత్‌తో మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఐసీసీ చీఫ్‌గా ఉన్న జై షా పాకిస్థాన్ క్రికెట్ బోర్డును అష్ట దిగ్బంధనం చేశాడని చెప్పొచ్చు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇచ్చే రెవెన్యూ వాటాను ఆపేస్తామని, దీర్ఘకాలంపాటు ఆంక్షలు విధిస్తామని ఐసీసీ హెచ్చరించింది. మరోవైపు బ్రాడ్‌కాస్టర్ సైతం రంగంలోకి దిగి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీకి వార్నింగ్ ఇచ్చింది. అదే జరిగితే నష్ట పరిహారంగా పీసీబీ భారీ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ఓవైపు ఐసీసీ నుంచి వచ్చే ఆదాయం ఆగిపోయి, మరోవైపు బ్రాడ్‌కాస్టర్‌తో న్యాయపోరాటం చేయాల్సి వస్తే.. పీసీబీ ఆర్థిక కష్టాలు మామూలుగా ఉండవు. ఇక భారత్‌లో టీ20 వరల్డ్ కప్ ఆడబోమంటూ టోర్నీ నుంచి బయటకు వెళ్లిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా.. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పీసీబీకి రిక్వెస్ట్ చేసింది. క్రికెట్ మంచి కోసం ఆడండి అని పైకి చెప్పినప్పటికీ.. అసలు కారణాలు మాత్రం వేరే. ఇప్పుడు పాకిస్థాన్ కనుక భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్‌తోపాటు టోర్నీ నుంచి అర్ధంతరంగా వైదొలిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుపైనా ఐసీసీ కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం. అదే జరిగితే రెండు బోర్డులూ తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటాయి. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికి బీసీబీ పాక్‌ను వాడుకుంది.

శివకుమార్ పట్టాభిషేకానికి ముహూర్తం ఫిక్స్

బెంగళూరు, ఫిబ్రవరి 11 కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. ఇప్పటివరకూ తెర వెనుక సాగిన సీఎం మార్పు చర్చలు ఇప్పుడు బాహాటంగా రోడ్డుపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూర్చోబెట్టాలంటూ ఎమ్మెల్యేలు బహిరంగంగా డిమాండ్ చేయడం కన్నడ రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టిస్తోంది. తాజా రాజకీయ ప్రకంపనలకు కేంద్ర బిందువు ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, చెన్నరాజ్ హట్టిహోలి. వీళ్లిద్దరూ డీకేకు కేవలం మద్దతు తెలపడమే కాకుండా, హైకమాండ్ ముందున్న లెక్కలను కూడా బయటపెట్టారు. పార్టీ కోసం రక్తం చిందించిన డీకేకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఇప్పటికే 80 నుండి 90 మంది ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన బహిరంగంగానే వెల్లడించారు. దీనికి మరో ఎమ్మెల్యే చెన్నరాజ్ హట్టిహోలి మరింత బలాన్ని చేకూర్చారు. "80 మంది కాదు, కాంగ్రెస్ నుంచి గెలిచిన మొత్తం 136 మంది ఎమ్మెల్యేలూ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు" అని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఏదో యాదృచ్ఛికంగా చేసినవి కావని, సిద్ధరామయ్య క్యాంప్‌కు ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటివని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2023 మేలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఈ

సీటుపై గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించిన తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం పెద్ద యుద్ధమే జరిగింది. అప్పట్లో ఢిల్లీ పెద్దలు కుదిర్చిన '30 నెలల ఫార్ములా' అంటే రెండున్నరేళ్ల ఒప్పందం ఇప్పుడు డీకే వర్గానికి అస్త్రంగా మారింది. ఆ గడువు ముగియడంతోనే, ఎమ్మెల్యేలు ఇప్పుడు తమ గళాన్ని పెంచారు. సాధారణంగా ఏ పార్టీలోనైనా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం క్రమశిక్షణారాహిత్యం కిందకు వస్తుంది. కానీ, డీకే శివకుమార్ అనుచరులు ఇంత ధైర్యంగా మాట్లాడుతున్నారంటే దీని వెనుక బలమైన స్కెచ్ ఉంది. సిద్ధరామయ్య ప్రజాకర్షణ ముందు డీకే వెనుకబడిపోకుండా, ఎమ్మెల్యేల బలం తనకే ఉందని నిరూపించుకోవడం దీని వెనుక ఉద్దేశం. సిద్ధరామయ్య తన 'అహింద' ఓటు బ్యాంకుతో పట్టు బిగిస్తుంటే, డీకే తన 'ఒక్కలిగ' సామాజిక వర్గ ఎమ్మెల్యేలను ఏకం చేస్తున్నారు. సిద్ధరామయ్య చుట్టూ ముదురుతున్న ముడా కేసు దర్యాప్తును ఆసరాగా చేసుకుని, నైతికత పేరుతో పదవిని బదిలీ చేయాలని కోరడం కూడా దీని వెనుక వ్యూహం కావచ్చు. ఎమ్మెల్యేలు బహిరంగంగా ప్రకటనలు చేస్తుంటే అధిష్టానం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సిద్ధరామయ్యను తప్పిస్తే వెనుకబడిన వర్గాలు ఏమౌతాయి? డీకేకు అవకాశం ఇవ్వకపోతే పార్టీకి ఆర్థిక బలం, ట్రబుల్ షూటింగ్ నెరవేరుతుందా? అనే సంకటంలో ఢిల్లీ పెద్దలు ఉన్నారు. మొత్తానికి ఎమ్మెల్యేల బహిరంగ వ్యాఖ్యలు కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు కేవలం ఊహాగానం కాదు, ఒక కార్యాచరణ అని స్పష్టం చేస్తోంది. డీకే శివకుమార్ వ్యూహాత్మకంగా తన అనుచరుల ద్వారా పావులు కదుపుతున్నారు. త్వరలోనే తనకు పట్టాభిషేకం ఖాయమనే ఆలోచనలో డీకే ఉన్నారు. ఆయన అనుచరుల తాజా వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. హైకమాండ్ పైన ఒత్తిడి తీసుకురావడం ద్వారా తమ పంచాన్ని నెగ్గించుకోవాలనుకుంటున్నారు. మరి సిద్ధరామయ్య ఈ ఎమ్మెల్యేల అస్త్రం నుండి తన కుర్చీని ఎలా కాపాడుకుంటారో చూడాలి.

అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయాల్లో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీది ఒక ప్రత్యేకమైన శైలి. ఇటీవల అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "రెడ్డి అయినా, రావు అయినా తమ దగ్గరకు రావాల్సిందే" అని ఆయన అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ చతురతను, గత కొన్ని దశాబ్దాల ఎంఐఎం ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఇది కేవలం ఒక పార్టీ ఆధిపత్యం మాత్రమే కాదు.., అధికార పార్టీలు, ఎంఐఎం మధ్య ఉన్న 'పరస్పర ప్రయోజనాల' బంధమని స్పష్టమవుతుంది. ఎంఐఎం పార్టీ పుట్టినప్పటి నుంచి అనుసరిస్తున్న ఏకైక సూత్రం "అధికారంలో ఎవరుంటే వారితో దోస్తీ" చేయడం. ఇది సిద్ధాంతాల కంటే ఎక్కువగా ప్రయోజనాల మీద ఆధారపడి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాం నుంచి మొదలుకొని, నేటి తెలంగాణ వరకు ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంత దూరం ఉన్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు హయాంలోనూ, ఆపై వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలోనూ ఎంఐఎం అత్యంత కీలక పాత్ర పోషించింది. కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో పాతబస్తీలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల ఎంఐఎం కాంగ్రెస్‌కు దూరమైంది. కానీ, రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే, కేసీఆర్‌తో ఫ్రెండ్లీ బంధాన్ని కొనసాగించింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌తోనూ అదే తరహా అనుబంధాన్ని కొనసాగిస్తోంది. అక్బరుద్దీన్ ఓవైసీ అన్నట్లుగా పార్టీలే తమ దగ్గరకు వస్తాయా? లేక వీరే వెళ్తారా? అనేది ఒక నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటిది. కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ వంటి పార్టీలకు ముస్లిం ఓటు బ్యాంకు కీలకం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30-40 నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. ఎంఐఎంతో దోస్తీ చేయడం వల్ల మైనారిటీల్లో ఒక 'పాజిటివ్ మెసేజ్' వెళ్తుందని, తద్వారా ఆయా వర్గాల ఓట్లు తమకే పడతాయని అధికార పార్టీలు భావిస్తాయి. ఎంఐఎం బలం కేవలం పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ స్థానాలకే పరిమితం. పాతబస్తీలో తమ పట్టును నిలుపుకోవాలన్నా, తమ నియోజకవర్గాలకు నిధులు కావాలన్నా, లేదా తమ మద్దతుదారుల వ్యాపార సామ్రాజ్యాలకు రక్షణ ఉండాలన్నా అధికారంలో ఉన్న పార్టీతో సత్సంబంధాలు ఎంఐఎంకు అత్యవసరం. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రస్తావన తెస్తూ అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తికరమైనవి. అయితే మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చినట్లుగా, ప్రతి నియోజకవర్గంలోనూ సమీకరణాలు వేరుగా ఉంటాయి. జూబ్లీహిల్స్ వంటి చోట్ల ఎంఐఎంకు గణనీయమైన ఓట్లు ఉన్నప్పటికీ, గెలుపు అనేది అభ్యర్థి వ్యక్తిగత బలం, అధికార పార్టీ మేనిఫెస్టోపై కూడా ఆధారపడి ఉంటుంది. ఇక్కడ ఎంఐఎం మద్దతు 'అదనపు బలం' కావొచ్చు కానీ, అదే 'ఏకైక బలం' అని చెప్పలేం. నిజానికి ఎంఐఎం ఎప్పుడూ 'కింగ్ మేకర్' కావాలని కోరుకోదు. ఎందుకంటే కింగ్ మేకర్ కావాలంటే ప్రభుత్వాలు పడిపోయే స్థితిలో ఉండాలి.

కానీ తెలంగాణలో మెజారిటీ ప్రభుత్వాలు ఉన్నా ఎంఐఎం వారితో స్నేహం చేస్తుంది. అంటే వారు 'కింగ్‌తో ఉండే పార్టీ'గా ఉండటానికే ఇష్టపడతారు. దీనివల్ల ప్రభుత్వ నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అవుతుంది. పోలీస్ యంత్రాంగం, పరిపాలనలో పాతబస్తీపై తమ గుత్తాధిపత్యం కొనసాగుతుంది. విపక్షంలో ఉండి పోరాటాలు చేసే శ్రమ తప్పుతుంది. అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు తమ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి, తమ ప్రాధాన్యతను తగ్గకుండా చూసుకోవడానికి చేసిన 'మైండ్ గేమ్'గా విశ్లేషకులు భావిస్తున్నారు. రెడ్డి అయినా, రావు అయినా చివరకు రాజకీయ ప్రయోజనాల కోసం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పని పరిస్థితి తెలంగాణలో ఉంది. ఎంఐఎంకు అధికారం కావాలి, అధికార పార్టీకి ముస్లిం ఓట్లు కావాలి. ఈ సమీకరణం ఉన్నంత కాలం "ఎవరు ఎవరి దగ్గరకు వెళ్లారు" అనే చర్చ కంటే, "ఎవరు ఎవరిని ఎంత ఉపయోగించుకున్నారు" అనేదే అసలైన రాజకీయం. అక్బరుద్దీన్ వ్యాఖ్యలు కేవలం పైన కనిపించే కోణం మాత్రమే.. లోపల ఉన్నది మాత్రం పక్కా రాజకీయ అవసరాల బంధం.

ఏప్రిల్ లో తెలంగాణ జాగృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూనే తన వ్యూహాలకు పదును పెట్టిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. తన స్వచ్ఛంద సంస్థ 'తెలంగాణ జాగృతి'ని పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వచ్చే ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో ఈ నూతన పార్టీ అధికారికంగా ప్రజల ముందుకు రానుంది. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని సాంకేతిక, చట్టపరమైన చర్యలను కవిత బృందం పూర్తి చేసింది. గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అవసరమైన అన్ని పత్రాలతో కూడిన దరఖాస్తును అందజేశారు. ఈసీఐ నిబంధనల ప్రకారం పార్టీ పేరు నమోదు, ఇతర వివరాల పరిశీలనకు సాధారణంగా రెండు నెలల సమయం పడుతుంది. అన్నీ సవ్యంగా సాగితే, ఉగాది పర్వదినం తర్వాత, ఏప్రిల్ ఆఖరి వారంలో ఒక మంచి ముహూర్తాన్ని చూసుకుని కవిత తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. భారత రాష్ట్ర సమితి) నుంచి సస్పెన్షన్‌కు గురైన తర్వాత కవిత తన రాజకీయ పంథాను పూర్తిగా మార్చుకున్నారు. కేవలం తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని తెలుసుకునేందుకు జాగృతి జనంబాట పేరుతో పర్యటనలు చేపట్టారు. కేవలం భావోద్వేగాల మీద కాకుండా, ప్రజా సమస్యల ప్రాతిపదికన పార్టీ విధానాలు ఉండాలని ఆమె భావిస్తున్నారు. వివిధ సామాజిక వర్గాల సమస్యలు, ఆర్థిక స్థితిగతులు, రైతాంగ ఇబ్బందులపై అధ్యయనం చేయడానికి 50 కమిటీలను ఏర్పాటు చేశారు. వేధావులు, విద్యార్థులు, కుల వృత్తుల వారితో సమావేశమై పార్టీ ఎజెండా రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని తీసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారు, అమరవీరుల కుటుంబాలు 'జాగృతి' నీడలోకి రావాలని ఆమె బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు. ఈ కొత్త పార్టీ రూపకల్పన వెనుక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ టీం పని చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ నుండి క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నిర్మాణ వరకు పీకే సలహాలను కవిత తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాబోయే జీహెచ్ఎంసీ (ఎన్నికలే ఈ పార్టీకి మొదటి పరీక్ష కానున్నాయి. ఒకవేళ ఈసీఐ నుంచి గుర్తింపు సకాలంలో వస్తే, హైదరాబాద్ నగర వ్యాప్తంగా అభ్యర్థులను నిలబెట్టి తన సత్తా చాటాలని కవిత యోచిస్తున్నారు. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రధాన రాజకీయ శక్తిగా ఎదగాలన్నది ఆమె మాస్టర్ ప్లాన్."నా రాజకీయ భవిష్యత్తు కోసం పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నాను. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు ఈ పార్టీ నాంది పలుకుతుంది" అని కవిత ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సామాజిక తెలంగాణ' నినాదంతో, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ ఎజెండా ఉండబోతున్నట్లు సమాచారం. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ప్రకటించనున్నారు. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య 'జాగృతి' ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి

తెలంగాణ జాగృతి

మీనాక్షి తెలంగాణ ఇన్ ఛార్జిగా ఉన్నారా

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ లో జరుగుతున్న వ్యవహారాలను పట్టించుకోవడం లేదనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వివిధ చోట్ల రెబెల్స్ నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ ఎలాంటి చర్యలకు ఆమె దిగడం లేదు. పార్టీ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో మీనాక్షి నటరాజన్ నానుస్తున్నారని అన్నారు. కనీసం మీనాక్షి నటరాజన్ రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలను హైకమాండ్ కు అసలు చెబుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా ఉంది. ఆమె ఏదో ఇన్ ఛార్జిగా ఉన్నట్లే ఉంటున్నారు తప్పించి ఎలాంటి కఠిన నిర్ణయాల వంటి జోలికి వెళ్లడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని కాంగ్రెస్ నేతలు కొందరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయిమీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీ కోటరీలో వ్యక్తి అంటారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటారనే ఆమెను తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జిగా నియమించారు. మీనాక్షి నటరాజన్ చాలా సింపుల్ గా ఉంటారు. గతంలో ఇన్ ఛార్జుల మాదిరిగా మీనాక్షి పార్టీ బలోపేతానికి తప్పించి మరే ఆలోచన చేయరు. తెలంగాణకు వస్తే హంగు ఆర్భాటాలను కూడా ప్రదర్శించరు. స్టార్ హోటల్స్ బస చేయరు. అలాగే ఏ స్థాయి నేత ఫోన్ చేసిన వెంటనే రెస్పాండ్ అవుతారు. అలాంటి మీనాక్షి నటరాజన్ గత కొద్ది రోజుల నుంచి తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలపై ఆమె స్పందించకపోవడం, పార్టీ అగ్ర నాయకత్వానికి కూడా తెలియజేయకపోవడంపైనే ఇప్పుడు గాంధీ భవన్ లో చర్చ జరుగుతుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కానీ, పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు సంబంధించి అసలు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళుతున్నారా? లేదా? అన్న అనుమానం కూడా నేతల్లో ఉంది. జీవన్ రెడ్డి వ్యవహారం తీసుకుంటే అది వెంటనే హైకమాండ్ కు చేరవేయాలి. ఆయన దశాబ్దాలుగా పార్టీలో ఉన్న నేత అని మీనాక్షికి తెలుసు. కనీసం ఆయన వద్దకు వెళ్లి మాట్లాడే ప్రయత్నం కూడా మీనాక్షి చేయలేదు. అంటే రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చేదానికి ఇక ఇన్ ఛార్జి ఎందుకన్న సందేహం సాధారణంగా కార్యకర్తల్లోనూ వ్యక్తమవుతుంది. అప్పుడప్పుడు ఇలా వచ్చి అలా మౌనంగా మీనాక్షి నటరాజన్ వెళ్లిపోతుంటే పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టులా తయారవుతుందన్న ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతుంది.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఆసిఫాబాద్ , పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె హరిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని న్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు వీల్ చైర్లు, వికలాంగులకు అవసరమైన సదుపాయాలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అన్ని సమృద్ధిగా ఏర్పాటు చేసినట్లు ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కె హరిత వెల్లడించారు.

పోలింగ్ భద్రతను పర్యవేక్షించిన డీసీపీ

మంచిర్యాల,మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని డీసీపీ భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనదని పేర్కొన్న ఆయన, ప్రతి పౌరుడు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ - బిఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం

షాద్ నగర్ ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని పదవ వార్డులో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. పదో వార్డు వద్ద కాంగ్రెస్ నాయకులు జహ్రద్ ఖాన్ వర్గం, పిల్లి శేఖర్ వర్గాలకు చెందిన కార్యకర్తలు పోలింగ్ కేంద్రం నిషేధాజ్ఞల వెలుపల ఓటర్ల విషయంలో జోక్యం చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాట పెరిగి వివాదానికి దారితీసింది. అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న కేశంపేట సిఐ నరహరి, ఎస్సై విజయ్ తదితర పోలీస్ సిబ్బంది వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపి లక్ష్మీనారాయణ, పట్టణ సిఐ విజయకుమార్ ఇరువర్గాలను అక్కడి నుండి చెదరగొట్టారు. ఇలాంటి వివాదాలకు ఉద్రిక్తతకు తావివ్వకుండా శాంతి వాతావరణం నెలకొల్పేందుకు ఇరువర్గాలను దూరం పంపించేశారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. శాంతిభద్రతలకు ఎవరైనా ఆటగాం కల్పించాలని చూస్తే ఎవరిని ఉపేక్షించమని ఎసిపి లక్ష్మీనారాయణ హెచ్చరించారు..

వికారాబాద్ లో భద్రత కట్టుదిట్టం

వికారాబాద్ ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)వికారాబాద్ మునిసిపల్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పట్టణ సీఐ రఘుకుమార్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రఘుకుమార్ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. ఎక్కడైనా చిన్న సమస్య తలెత్తినా వెంటనే 100కు డయల్ చేయాలని లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి వ్యక్తికి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.వికారాబాద్ మునిసిపల్ పరిధిలో కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న నేపథ్యంలో అక్కడ పారామిలిటరీ దళాలను మోహరించామని తెలిపారు. ఎక్కడా చిన్న సమస్య కూడా తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.ఈ ఎన్నికల సందర్భంగా దాదాపు 200 మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని సీఐ రఘుకుమార్ వెల్లడించారు.

బైక్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

మేడ్చల్ ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. . ఘట్కేసర్ పోలీసుల వివరాలు ప్రకారం ఎన్ ఎఫ్ సి నగర్ బ్రిడ్జి సమీపంలో హైదరాబాద్ వైపు నేషనల్ హైవే ల్ పై చెత్త ఏరుకుంటున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి (50)ని అతివేగంతో బైకు ఢీకొట్టడంతో అతనికి తలకు ఇతర శరీర భాగాలపై గాయాలు అయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో గాంధీ హాస్పిటల్ నకు తరలించి, ఓఒఅ ఔనీ. 79408, చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. . బైకు ను వేగంగా నడిపిన రైడర్ నితిన్ పై పోలీసులు కేసు నమోదు చేసారు.

ఇంద్రేశంలో ఉద్రిక్తత

సంగారెడ్డి ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీలో కౌన్సిలర్ అభ్యర్థి ఐలాపురం నాగరాజు పై దాడి జరిగిందని స్థానికులు అందోళనకు దిగారు. అభ్యర్థి నాగరాజు కాలనీలో వెళ్తుంటే పోలీస్ కానిస్టేబుల్ తోసేవేయడం వివాదం గా మారింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగరాజు మీద పోలీసులు చేయి వేసుకోవడం సరికాదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకక్కసారిగా రోడ్డు పై బైఠాయించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు వారిని అడ్డుకున్నారు.

ఉపాధి కూలీలకు పలుగు, పారా పంపిణీ

టేకులపల్లి, ఫిబ్రవరి 11 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని టేకులపల్లి పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పలుగు, పార, బొచ్చలు సర్పంచ్ బోడ బాలు నాయక్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. టేకులపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కార్మికులలో 30 గ్రూపులకు 30 గడ్డ పారలు, 60 పారలు, 90 బొచ్చలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, ఉప సర్పంచ్ వసంత, వార్డు సభ్యులు జీజ, సుజాత, రామకృష్ణ, కిరణ్, గణేష్, ఉషా, కోక, కోటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

అధికార పార్టీ అరాచకాలు ఆపాలంటూ సూర్యాపేటలో ఆందోళన

సూర్యా పేట, ఫిబ్రవరి 11 : అధికార కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఏళ్లుగా కష్టపడి పని చేస్తే కౌన్సిలర్ టికెట్ ఇవ్వకపోగా తాను స్వతంత్రంగా పోటీ చేస్తే పోలింగ్ సెంటర్‌లోకి అనుమతించకుండా పోలీసులతో దౌర్జన్యాలు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 25వ వార్డు స్వతంత్ర అభ్యర్థి కోడి శిరీష శివ యాదవ్ ఆరోపిస్తూ బుధవారం ఆ వార్డు పోలింగ్ కేంద్రం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వతంత్ర అభ్యర్థిగా తాను ఫుట్‌బాల్ గుర్తుపై పోటీ చేస్తూ గెలుస్తున్నాననే భయంతో అధికార కాంగ్రెస్ పార్టీ తనపై దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోలింగ్ కేంద్రంలో తిరుగుతున్నాడని, తమను మాత్రం పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఉండమని పోలీసులు తరుముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. తమకు మద్దతు ఇచ్చే వారిని సైతం బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.

ఇకపై స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి.. జగనణమన కంటే ముందే పాడాలి.. కేంద్రం ఆదేశాలు

న్యూ ఢిల్లీ, జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించే విషయంలో కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని అని ఆదేశించింది. జాతీయ గీతం 'జనగణమన' పాడటానికి ముందు వందేమాతరం కూడా పాడాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఉదయం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ తప్పనిసరిగా నిలబడాలి.గేయంలోని ఆరు చరణాల్ని ఆలపించాల్సిందే. వీటిలో కాంగ్రెస్ 1937లో తొలగించిన నాలుగు చరణాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఆలపించాలి. గతంలో నెహ్రూ ఆధ్వర్యంలో సెక్యులర్ అంశాలను సాకుగా చూపి, ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు గేయంలోని నాలుగు చరణాలను తొలగించారు.

ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం వాటిని కూడా తిరిగి చేర్చింది. ఈ అంశంపై గత ఏడాది కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటలయుద్ధం నడిచింది. తాజా మార్గదర్శకాల ప్రకారం సినిమా హాళ్లలో వందేమాతరం ప్లే చేయాల్సిన అవసరం లేదు. అలాగే థియేటర్లలో లేదా న్యూస్ రీల్స్‌లో ఈ గేయం ప్లే అవుతుంటే నిలబడాల్సిన అవసరం లేదు. ఇలాంటి చోట్ల ఎక్కువ మంది నిలబడటం వల్ల కార్యక్రమానికి ఆటంకం కలగడం, అలాగే శాంతి భద్రతల సమస్యను దృష్టిలో ఉంచుకుని తాజా ఆదేశాలిచ్చింది.'వందేమాతరం' ఆలపించడానికి మూడు నిమిషాల 10 సెకండ్ల సమయం పడుతుందని కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు అయినటువంటి రాష్ట్ర వేడుకలు, పౌర సన్మానాలు, రాష్ట్రపతి పర్యటన, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, మంత్రులు పాల్గొనే వేడుకలు, జాతీయ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాల సందర్భంగా ఇకపై వందేమాతరం ఆలపించాలి. ఇప్పటికే పద్మ వంటి కేంద్ర అవార్డులు ప్రదానం చేసే వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపిస్తున్నారు. ఈ నిబంధనలు అతిక్రమించి జాతీయ గేయాన్ని అవమానిస్తే వారికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. 'వందేమాతరం' గేయాన్ని 1875లో బంకించంద్ర ఛటర్జీ రచించారు. తర్వాత దీన్ని ఆయనే తన ఆనంద్ మఠ్ అనే నవలలో భాగం చేశారు. ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే తాజా ఆదేశాలిచ్చింది.

ముంబై మేయర్‌గా రితూ తావ్డే, డిప్యూటీ మేయర్‌గా సంజయ్ ఘూడీ ఎన్నిక

ముంబై మేయర్ పీఠం విషయంలో కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. ముంబై నగరం (బృహన్ ముంబై కార్పొరేషన్) మేయర్‌గా బీజేపీకి చెందిన రితూ తావ్డే, డిప్యూటీ మేయర్‌గా శివసేన (షిండే) వర్గానికి చెందిన సంజయ్ ఘూడీ ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే, ఏకగ్రీవంగా ఇద్దరినీ ఎన్నుకున్నారు. దీంతో 25 ఏళ్లపాటు థాక్రే ఆధ్వర్యంలోని శివసేన చేతిలో ఉన్న ముంబై మేయర్ పదవి ఇప్పుడు బీజేపీ పరమైంది.రితూ తావ్డే మూడుసార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. ఆమె ఘట్‌కోపర్ (132వ వార్డు) స్థానం నుంచి ఇటీవల గెలిచారు. గతంలో బీఎంసీకి చెందిన ఎడ్యుకేషన్ కమిటీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. తర్వాత 2012లో బీజేపీలో చేరారు. బీఎంసీలో జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే హాజరయ్యారు. రితూ, సంజయ్ ఎన్నికపై వారు హర్షం వ్యక్తం చేశారు. వారి నాయకత్వంలో ముంబై అభివృద్ధి చెందుతుందని, ప్రతి ముంబైకర్ ఆశల్ని నిజం చేస్తారని ఫడ్నవీస్ అన్నారు. రితూ తావ్డే బీజేపీ తరఫున ముంబైకి ఎన్నికైన రెండో మేయర్. చివరగా 1982-83 కాలంలో ప్రభాకర్ పాయ్ మేయర్‌గా పని చేశారు.డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సంజయ్ ఘూడీ 15 నెలలు మాత్రమే ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత శివసేన (షిండే)కు చెందిన ఇతరులకు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సంజయ్ ఘూడీ ఐదో వార్డు అయిన మగథానే నుంచి శివసేన తరఫున 15,000 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతకుముందు ఆయన థాక్రే వర్గంలో ఉండేవారు. ఎన్నికలకు ముందు షిండే వర్గంలో చేరి, గెలిచారు.

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం.. పోలింగ్ కేంద్రం వద్దే ప్రచారం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు, అభ్యర్థులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రం ప్రచారం చేస్తున్నారు.కొల్లాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓ కాంగ్రెస్ అభ్యర్థి భర్త పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భర్త సతీష్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను ప్రలోభపెడుతున్న దృశ్యాలు ఇప్పుడు ఆన్‌లైన్‌లో హల్ చల్ చేస్తున్నాయి.కాంగ్రెస్ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొల్లాపూర్ 1వ వార్డులో పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల కాంగ్రెస్ నాయకులు ఓటర్ స్లిప్పుల వెనుక కాంగ్రెస్ పార్టీ గుర్తుతో కూడిన కరపత్రాన్ని ఓటర్లకు పంచుతూ ప్రచారం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు.ఓ వైపు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం.. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం జరుగుతున్నా అక్కడే ఉన్న పోలీసులు, అధికారులు చోద్యం అందరినీ షాక్‌కు గురిచేస్తుంది. .

కొత్తగూడెంలో ప్రశాంతంగా పోలింగ్.. ఓటు వేసిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం. ఫిబ్రవరి 11 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుంది. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి క్యూ లైన్ లో వేచి ఉన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పాల్వంచ జగ్గు తండాలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇల్లెందు, అశ్వరావుపేట, కొత్తగూడెం పట్టణాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టర్ పోలింగ్ సరళని పరిశీలిస్తున్నారు.

పడమటిసోమారంలో లింగబసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బీబీనగర్, ఫిబ్రవరి 11 : బీబీనగర్ మండలంలోని పడమటిసోమారం గ్రామంలో గల శ్రీ లింగబసవేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది. ఉదయం 11 గంటలకు దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ సందిగారి బస్వయ్య, ఈఓ నరేందర్ రెడ్డి సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, తాసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, సీఐ ప్రభాకర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుల 'హర హర మహాదేవ' నినాదాలతో ఆలయం మార్మోగింది. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు, అర్చనలు, ఊరేగింపులతో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ భాస్కర్, దేవస్థానం ధర్మకర్తలు ఆలేటి బలరాం, ఆల్వ గోపాల్ రెడ్డి, నడికుడి వెంకటేశ్, గొరుకంటి జాతయ్య, మాజీ ఎంపీటీసీ బొమ్మగొని బస్వయ్యగౌడ్, మాజీ దేవాలయ చైర్మన్లు యర్రబోతు శ్రీనివాసరావు, ఆల్వ వీరారెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వాకిటి సంజీవరెడ్డి, నాయకులు ఆల్వ రామకృష్ణారెడ్డి, ఆలేటి రాంకొండల్, కంభం భాస్కర్ గౌడ్, వాకిటి యాదిరెడ్డి, కుంభం సుభాష్ గౌడ్, తలబోయిన కృష్ణ యాదవ్, బొమ్మగొని బాలయ్య పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తున్నమంత్రి వివేక్.. బాల్కసుమన్ నిరసన

చెన్నూర్, ఫిబ్రవరి 11 : చెన్నూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో మంత్రి వివేక్ వెంకట స్వామి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఇందుకు నిరసనగా చెన్నూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ముందు బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకట స్వామి బైక్‌లపై పోలింగ్ బూత్‌ల వద్ద తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ తన తన కారులో 15 లక్షల రూపాయలను, మందు కాటన్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పంపిణీ చేశారని ఆయన ఆరోపించారు.చెన్నూర్ మున్సిపాలిటీలో రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భర్త పెద్దింటి శ్రీనివాస్ ఓటర్లకు డబ్బులు బహిరంగంగా పంచుతున్న వీడియో బయటకు వచ్చిందని, దీన్నిబట్టి చూస్తుంటే ఎన్నికలు ఎంత దుర్మార్గంగా జరుగుతున్నాయో స్పష్టమవుతున్నాయని బాల్క సుమన్ అన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేములవాడలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్నారై కార్తికేయ

వేములవాడ, ఫిబ్రవరి 11: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని చెబుతున్న కొందరు గడప దాటని విధానం ఇంకా కొనసాగుతూనే ఉంది. వేములవాడ పురపాలక సంఘం ఎన్నికల్లో మాత్రం ఏకంగా వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి అమెరికా నుండి వచ్చి ఒకరు పురపాలక సంఘం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం సర్వత్రా హర్ష వ్యక్తమవుతోంది.అమెరికాలో ఉద్యోగంలో స్థిరపడిన కార్తికేయ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేములవాడకు వచ్చి 28వ వార్డులో తన ఓటు వినియోగించుకున్నారు. యువతకు ఆయన ఓటుకున్న విలువను గురించి తెలియజేసినట్లుగా స్థానికులు తెలిపారు.

ట్రయాంగిల్ ఫైట్ లో గెలుపు ఎవరిది

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)తెలంగాణ మున్సిపల్ ఎన్నికల క్లైమాక్స్ మొదలైంది. పార్టీలు జారీ చేసిన బీ-ఫారాలు ఒకరికి దక్కితే, ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించారంటూ పలువురు నేతలు స్వతంత్రులుగా జెండా ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,700 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, ఇంకా 12,900 మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో మెజారిటీ అభ్యర్థులు ప్రధాన పార్టీలకు చెందిన రెబల్స్ కావడం గమనార్హం. గెలుపు గుర్రాల కంటే, ప్రత్యర్థి గెలుపును అడ్డుకునే ఓట్ల చీలిక వ్యూహంతో వీరు ముందుకు వెళ్తుండటం పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా ఉంది.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ సమస్య అత్యధికంగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని భావించిన ఆశావాహులు టికెట్ ఆశించారు. కానీ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పాత క్యాడర్ భగ్గుమంటోంది. ఉదాహరణకు జగిత్యాలలో సీనియర్ నేత జీవన్ రెడ్డి , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య టికెట్ల కేటాయింపు వివాదం రచ్చకెక్కింది. ఇలాంటి పరిస్థితులే మెదక్, గద్వాల వంటి చోట్ల కూడా కనిపిస్తున్నాయి. బీ-ఫారాల పంపిణీలో జరిగిన జాప్యం , సమన్వయ లోపం వల్ల కాంగ్రెస్‌లో రెబల్స్ సంఖ్య పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. పార్టీని నమ్ముకుని ఉన్న స్థానిక నేతలు, టికెట్ దక్కని పక్షంలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని భావించి బరిలోకి దిగారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా సొంత పార్టీ వారే భారీగా నామినేషన్లు వేశారు. కొందరు నేతలు ఇతర పార్టీల నుంచి వచ్చిన విమర్శలకు కౌంటర్ ఇవ్వడం కంటే, సొంత పార్టీ అభ్యర్థులనే టార్గెట్ చేయడం అధిష్టానాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. క్రమశిక్షణ చర్యల హెచ్చరికలు జారీ చేసినా చాలా మంది వెనక్కి తగ్గకపోవడం గమనార్హం.కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలోనూ పుంజుకుంటున్నామన్న ధీమాతో ఉన్న బీజేపీలోనూ రెబల్స్ బెడద తప్పలేదు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ పకడ్బందీగా అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని చోట్ల ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారికి కాకుండా కొత్తగా చేరిన వారికి టికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు రెబల్స్ పై సీరియస్ అయ్యారు. నామినేషన్లు ఉపసంహరించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినప్పటికీ, నిజామాబాద్, అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులకు రెబల్స్ గట్టి పోటీ ఇస్తున్నారు.ఈ రెబల్స్ ప్రభావం వల్ల బహుముఖ పోటీ నెలకొంది. విజేతను నిర్ణయించే మేజారిటీ ఓట్లు ఈ స్వతంత్రుల ఖాతాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. కేవలం 100 నుండి 500 ఓట్ల తేడాతో గెలుపోటములు నిర్ణయమయ్యే మున్సిపల్ వార్డుల్లో, ఈ రెబల్స్ చీల్చే 50 ఓట్లు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తాయి. దీనివల్ల కొన్ని చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓడిపోయి, స్వతంత్రులు కింగ్ మేకర్లుగా లేదా విజేతలుగా అవతరించే అవకాశం ఉంది. ఈ ఎన్నికలు ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, విపక్ష బీజేపీ మధ్య ముక్కోణపు పోటీని తలపిస్తున్నాయి. ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి మున్సిపోల్స్ కావడంతో, కాంగ్రెస్ దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు తమను గెలిపిస్తాయని ఆ పార్టీ నమ్ముతోంది. మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం ద్వారా రాష్ట్రంపై తమ పట్టును నిరూపించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహరచన చేశారు.తమ పదేళ్ల అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో తమకు బలమైన క్యాడర్ ఉందని, అక్కడ మెరుగైన ఫలితాలు సాధిస్తామని గులాబీ దళం ఆశిస్తోంది.ఉత్తర తెలంగాణపై బీజేపీ గట్టి ఆశలు పెట్టుకుంది. పట్టణ ప్రాంత ఓటు బ్యాంకు సంప్రదాయబద్ధంగా తమకే మద్దతు ఇస్తుందని ఆ పార్టీ నమ్ముతోంది. నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమైంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ ఎన్నికల్లో ప్రాంతాల వారీగా విభిన్నమైన ట్రెండ్ కనిపిస్తోంది. ఉత్తర తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగనుంది. రామగుండం, నిజామాబాద్ వంటి కార్పొరేషన్లలో బీజేపీ సత్తా చాటాలని చూస్తోంది. ఇక దక్షిణ తెలంగాణలోని మహబూబ్ నగర్, నల్గొండ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ బలంగా ఉన్నప్పటికీ, అధికార బలం కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశం ఉంది. మొదటి స్థానంలో నిలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం తామే అని నిరూపించుకోవడానికి బీఆర్ఎస్, బీజేపీ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.మొత్తం 2,996 వార్డుల్లో సుమారు 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాలు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించనున్నాయి. ఓటర్లు తమ నగరాల, పట్టణాల అభివృద్ధి కోసం ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

సింగరేణి పెన్షన్ సవరణకు కీలక అడుగు

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి , సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుదల కోసం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి కీలక స్పంద న వచ్చిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మీడి యాకు తెలిపారు. యాక్చురియల్ రిపోర్ట్ ఆధారం గా సింగరేణి పెన్షన్ సవరణ చేపట్టేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ ముందడు గు వేసిందని, ఈ అంశంపై ఎంపీ వంశీకృష్ణ గత 6 న కేంద్ర బొగ్గు గనుల శాఖకు లేఖ రాసి, పెన్షన్ పెంపు, యాక్చురియల్ రీఅసెస్మెంట్ నిర్వహించాలని కోరారు. ఈ లేఖకు తాజాగా స్పందించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ అండర్ సెక్రటరీ రూపిందర్ బ్రార్, గతేడాది డిసెంబర్ 22న సీఎంపీఎఫ్ఓ ట్రస్టీల సమావేశం నిర్వహిం చామని లేఖలో వెల్లడించారు. ఆ సమావేశం లో పెన్షన్ నిధి మూల్యాంకనంతో పాటు యాక్చురీని నియమించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ యాక్చురీ పెన్షన్ పెంపు, నిధుల స్థితి, ఇతర కీలక అంశాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక అందించ నుందన్నా రు. ఆ యాక్చురీ రిపోర్ట్ ఆధారంగా సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ సవరణ చేపట్టనున్నారు. దీంతో సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచాలని శక్తివంచన లేకుండా పోరాడుతున్నానని ఆయ న పేర్కొన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు మరోసారి మాట ఇస్తున్నానని మీ పెన్షన్ పెరిగే వరకు నా పోరాటం ఆగదని తెలిపారు. ఈ విషయంలో మీకు పూర్తి భరోసా ఇస్తున్నానని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

మహబూబ్నగర్ కార్పొరేషన్లో పోలింగ్ కేంద్రాల సందర్శన

భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

మహబూబ్ నగర్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, మహబూబ్నగర్ కార్పొరేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీ బ్రిలియంట్ స్కూల్, ఠాగూర్ స్కూల్, గాంధీ రోడ్ స్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, సిబ్బంది విధులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, క్యూలైన్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అక్కడి అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపారు. సీఐలు, డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు విధులు నిర్వర్తిస్తూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా రూట్ మొబైల్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతలను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాయని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యే వరకు పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ.12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు.పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ.12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 250 వరకు రోబోటిక్ సర్జరీలు చేశారు. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 700-800 వరకు రోగులు క్యాన్సర్ చికిత్సల కోసం ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చాలామంది రోగులు వస్తుంటారు. సాధారణంగా ఒక రోబో సర్జరీకి ప్రైవేటు ఆసుపత్రిలో అయితే రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఎంఎన్‌జేకు ఒక్కో రోబో సర్జరీకి రూ.1.5 లక్షల వరకు చెల్లిస్తోంది.కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భసంచి, అన్నవాహిక, ప్రొస్టేట్ క్యాన్సర్లకు గతంలో కోత పెట్టి క్యాన్సర్ గడ్డలను తొలగించే వారు. అయితే అతి చిన్న క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి డాక్టర్లకు కొన్నిసార్లు సాధ్యమయ్యేది కాదు. అధిక రక్త స్రావంతో పేషెంట్లు ఎక్కువ రోజులు హాస్పిటల్స్‌లోనే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యాధునిక సర్జికల్ రోబోతో అతి చిన్న కణతులను చాలా ఈజీగా తొలగిస్తున్నారు. ఎలాంటి కోత లేకుండానే.. నాలుగు రంధ్రాలతో రోబో చేతులు లోపలకు వెళ్లి క్యాన్సర్ గడ్డలను పూర్తిగా తొలగిస్తున్నాయి. డాక్టర్లకు చేతులు వణుకు సమస్య ఉంటే ఈ శస్త్రచికిత్సలు చాలా కష్టమయ్యేవి. ప్రస్తుతం రోబోలతో సర్జరీలు చేస్తుండటంతో ఆ పరిస్థితి లేదు. ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం కూడా చాలా తక్కువ. మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌కు రోబోటిక్ సహాయ శస్త్ర చికిత్స మంచి ఫలితాలు అందిస్తోంది.ఇక తెలంగాణలో వైద్యారోగ్యశాఖ బలోపేతానికి సర్కార్ కీలక చర్యలు తీసుకుంటుంది. ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు ఇతర సిబ్బంది నియామకానికి ఆదేశాలు ఇచ్చింది. దాంతో పాటుగా కొత్తగా ఆసుపత్రుల నిర్మాణం.. ఇప్పటికే ఉన్న ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. జిల్లాల్లోనూ డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి కిడ్నీ రోగులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్) తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్‌గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా వరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ-కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్‌ప్లాన్ బ్యాక్‌బోన్‌గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్, ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించనున్నారు.ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాలతో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ-మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

12 ఫిబ్రవరి 2026 దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

పరవాడ. మండలంలో పరవాడ ఫార్మాసిటీ లో ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బుధవారం ఫార్మాసిటీ విజయ్ శ్రీ దగ్గర నుండిబైక్ ర్యాలీ ఐఓసీ మీదగా తానం చెక్పోస్ట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మికులకు నష్టం కలుగజేస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని గని శెట్టి పిలుపునిచ్చారు. 2025 నవంబర్ 21 భారత కార్మిక వర్గానికి ఒక్క చీకటి దినం అన్నారు. ఆరోజు నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని నినాదాలు చేస్తూ బైక్ యాత్ర కొనసాగించారు. అనంతరం ఐఓసీ దగ్గర జరిగిన సభా కార్యక్రమంకి సిఐటియు నాయకులు పి వెంకట్రావు అధ్యక్షత వహించగా ముఖ్య వక్త గా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల ధారబాబు, పి చిన్నారావు, ఏ రాజా, చిరంజీవి, ముత్యాలు, కృష్ణ, అప్పారావు, సత్తిబాబు, రాము, పైడ్రాజు, కన్నబాబు, నాగేష్, తదితర సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణకు కొత్తగా మద్యం బ్రాండ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (న్యూస్ పల్స్)ప్రపంచంలో కొన్ని వేల రకాల మద్యం బ్రాండ్లు ఉన్నాయి. కానీ, మందుబాబులు ఎక్కువగా తాగేది బీరే. కొంతమంది కొత్త వెరైటీలు టేస్ట్ చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని మద్యం బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త బ్రాండ్లు, విదేశీ బ్రాండ్లు కావాలని చాలా మంది కొరుకుంటుంటారు. అయితే, వారి కోరిక ఫలించేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్లకు అనుమతి ఇవ్వాలని డిసైడ్ అయింది.రాష్ట్రంలో త్వరలో నూతన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు గతంలో ప్రభుత్వం చేసిన కసరత్తు తర్వాత పెద్ద ఎత్తున విమర్శలు రాగా.. ఆ ప్రక్రియను తాత్కాలికంగా ప్రభుత్వం విరమించుకున్నది. అయితే, ప్రభుత్వం తాజాగా బడ్జెట్లో రాబడి అంచనాలను పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆరా తీయడంతో ఈ నిర్ణయం అమలు చేయనుందని తెలుస్తోందితెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1,956 బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే మరో 604 మద్యం బ్రాండ్లు రాష్ట్రంలోకి అడుగుపెట్టేందుకు ఎదురుచూస్తున్నాయి. వీటి అనుమతి కోసం సుమారు 92 కంపెనీలు ఉండగా.. ఇందులో బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ ఛాలెంజ్, సులావైన్ వంటివి ఇక్కడ ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్లు ఉన్నాయి. కొత్తగా రాబోతున్న వాటిలో 15 విదేశీ బ్రాండ్లు, 15 దేశీయ లిక్కర్, 7 బీర్ బ్రాండ్లు, 37 కొత్త బ్రాండ్లు ఉన్నాయని తెలుస్తోంది.ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులకు భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) పట్టుబడింది. ఆ మద్యం సీసాల్లో లోకల్ బ్రాండ్లు లేకపోవడం, విదేశీ బ్రాండ్ మద్యం అక్రమ తరలింపు గుర్తించారు. ఈ ఎన్డీపీఎల్‌లో అత్యధికశాతం మన దగ్గర అందుబాటులో లేని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ఉంటున్నాయని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న బ్రాండ్లకు అనుమతి లభిస్తే ఈ ఎన్టీపీఎల్ సమస్య తగ్గుతుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.కొత్తవాటికి అనుమతిస్తే.. ఒక్కో బ్రాండు రూ.15 వేల చొప్పున అనుమతి ఫీజును వసూలు చేయనున్నారు. తద్వారా రూ.90,45,000లు ప్రభుత్వానికి రాబడి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని వివాదాస్పద మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమైంది. అప్పటికే సదరు కంపెనీల నేపథ్యం వివాదాస్పదంగా ఉండటం, కొన్నిచోట్ల అవి కల్తీ మద్యం విక్రయించాయని తేలడంతో ప్రభుత్వం వాటితో ఒప్పందాలు రద్దు చేసుకున్నది. ఈ క్రమంలో అప్రమత్తమైన ఎక్సైజ్శాఖ వివాదాస్పద కంపెనీలను పక్కనపెట్టిన విషయం తెలిసిందే.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయిపోయాక.. కొత్త బ్రాండ్లకు గేట్లు తెరవాలని సర్కార్ ప్లాన్ చేస్తోంది. అంటే.. మార్చి లేదా ఏప్రిల్‌లో కొత్త మద్యం బ్రాండ్లు క్యూ కట్టే ఛాన్స్ ఉంది. ఇక అప్పుడు చూడాలి.. మందుబాబుల ఆనందం? మామూలుగా ఉండదు.

మూడు భాగాలుగా జీహెచ్ఎంసి

హైదరాబాద్,జీహెచ్ఎంసీ ని జీహెచ్ఎంసీ, సైబరాబాద్(సీఎంసీ), మల్కాజ్గిరి(ఎంఎంసీ)లను మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కార్పొరేషన్లకు నూతన కమిషనర్లను నియమించింది. జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిషనర్గా ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్గా శ్రీజన, మల్కాజ్గిరి కార్పొరేషన్ కమిషనర్గా వినయ్ కృష్ణా రెడ్డి ని నియమించారు. సీఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, పటాన్చెరు, కూకట్పల్లి(పాక్షికంగా), మేడ్చల్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలో ముషీరాబాద్, మలక్పేట్, అంబర్పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్పురా, బహదూర్పురా, సికింద్రాబాద్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు ఎంఎంసీ పరిధిలో మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మేడ్చల్, కూకట్పల్లి(పాక్షికంగా), ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు వస్తాయి.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తీరుపై డీజీపీ బి. శివధర్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్,రాష్ట్రంలో కొనసాగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తీరుపై కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి డీజీపీ బి. శివధర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని వెబ్కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సూచనలు చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే గొడవలపై అయన స్పందించారు. అధికార పార్టీకి పోలీసుల మద్దతు అనేది అవాస్తవం. నల్గొండ, కరీంనగర్లో జరిగేవి చిన్న గొడవలే. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని అన్నారు.

మీ గుండె కవాటాల్లో ఏదైనా ట్రబుల్ ఉంటే శరీరంలో కనిపించే లక్షణాలు, నిర్లక్ష్యం చేయొద్దు

ఈ రోజుల్లో గుండెకి సంబంధించిన వ్యాధులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతక పరిస్థితులు తలెత్తవచ్చు. అలాంటి సమస్యల్లో గుండె కవాటాలకి సంబంధించిన వ్యాధులు కూడా ఉన్నాయి. చాలా మంది దీనిని సకాలంలో గుర్తించలేరు. దీన్ని ముందుగానే గుర్తించడం వల్ల జీవిత కాలం, నాణ్యత రెండూ మారవచ్చు.

భారదేశంలో దాదాపు 28 శాతం మరణాలకు గుండె జబ్బులు కారణం. అయితే, గుండెకి సంబంధించిన చాలా జబ్బుల్లో లక్షణాలు ముందుగా కనిపించవు. అలాంటి వాటిలో గుండె కవాటాల జబ్బు కటి. ప్రతి ఏడాది దాదాపు 2.87 మిలియన్ల మంది భారతీయులు హృదయ సంబంధ కారణాల వల్ల మరణిస్తున్నారు. భారతదేశంలో ప్రామాణిక మరణాల రేటు 100,000కు 282 వద్ద ఉంది. ఇది ప్రపంచ సగటు 233 కంటే చాలా ఎక్కువ.గుండె కవాట వ్యాధులను చాలా మంది హార్ట్ ఎటాక్ అని భావిస్తారు. అయితే, ఇవి వేరు అని నిపుణులు అంటున్నారు. గుండెలో నాలుగు కవాటాలు ఉంటాయి. ఈ కవాటాల్లో ఒకదానిలో కూడా సమస్య ఉంటే, దానిని గుండె కవాట వ్యాధి అంటారు. గుండెలోని నాలుగు కవాటాలు సరైన దిశలో రక్త ప్రవాహానికి సాయపడతాయి. అయితే, కొన్ని సందర్భాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కవాటాలు సరిగ్గా వంప్ చేయకపోవచ్చు.ఫలితంగా, శరీరంలోని ప్రతి భాగానికి రక్తం సరిగ్గా ప్రవహించదు. ఈ పరిస్థితి శరీరానికి మంచిది కాదు. భారతదేశంలో గుండె కవాటాల వ్యాధుల సమస్య ఎక్కువగా ఉంది. రుమాటిక్ గుండె జబ్బులు మిట్రల్, బృహద్ధమని కవాటాల్ని దెబ్బతీస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తున్నట్టు డాక్టర్ తెలిపారు. ఇది తరచుగా బాల్యంలో చికిత్స చేయని స్ట్రెప్టోకోకల్ గొంతు ఇన్ఫెక్షన్లతో ప్రారంభమవుతుంది. సంవత్సరాల తరువాత యుక్తవయస్సులో శ్వాస ఆడకపోవడం లేదా అలసటగా కనిపిస్తుంది.?అదే సమయంలో మన దేశంలోని పట్టణాల్లో క్షీణించిన కవాటాల వ్యాధిలో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. అధిక రక్తపోటు దాదాపు 30 శాతం మంది వయసు పైబడ్డవారిని ప్రభావితం చేస్తుంది. ఇందులో పొగాకు వినియోగం శాతం 13గా ఉంది. ఎక్కువ ఆయుర్దాయం, జీవక్రియ రుగ్మతలు ఈ వ్యాధికి కారకాలుగా నిలిచాయి. పట్టణాల్లో ఈ వ్యాధులు ఎక్కువగా జీవనశైలిలో మార్పుల వల్ల వస్తున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో రుమాటిక్ ఫీవర్ ప్రధాన కారణం.

1అలసట: ఏదైనా గుండె జబ్బులో అలసట అనేది అత్యంత సాధారణ లక్షణాల్లో ఒకటి. అదేవిధంగా, గుండె కవాట వ్యాధి ఉన్న రోగులు తక్కువ శారీరక శ్రమతో కూడా అలసిపోవచ్చు. కొన్నిసార్లు, వారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా రావచ్చు. చిన్న చిన్న పనులకే అలసట, బలహీనత వంటి సమస్యలు రావచ్చు.

పాదాలు లేదా చీలమండల వాపు: ఈ వ్యాధుల్లో పాదాలు లేదా చీలమండల వాపు కూడా గమనించవచ్చు. ప్రారంభ రోజుల్లో చాలా మంది ఈ వాపును పట్టించుకోకపోవచ్చు. పాదాల్లో వాపు కనిపించిన వెంటనే అలర్ట్ అవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఛాతీ నొప్పి: గుండె కవాట వ్యాధి ఉన్న రోగులు నిరంతర ఛాతీ నొప్పిని అనుభవించవచ్చు. అంతేకాకుండా గుండె దడ పెరగొచ్చు.

తల తిరగడం: ప్రారంభ సంకేతాల్లో తలతిరగడం కూడా ఒక కారణమవుతుంది. బలహీనతతో పాటు తలతిరగడం కనిపిస్తే అలర్ట్ అవ్వాలని డాక్టర్ సూచిస్తున్నారు.

క్రమరహిత హృదయ స్పందనలు: వేగంగా నడిచినప్పుడు లేదా మెట్లు

ఎక్కినప్పుడు క్రమరహిత హృదయ స్పందనలు గమనిస్తే అలర్ట్ అవ్వాలని డాక్టర్ సూచిస్తున్నారు.

వయసు పెరిగే కొద్దీ గుండె కవాట వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

ఆహారపు అలవాట్లు సరిగా లేకపోతే, ఈ వ్యాధి వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుంది.

కుటుంబంలో ఎవరికైనా కొరోనరీ హార్ట్ డిసీజ్ ఉంటే.. ఈ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

అనారోగ్యకరమైన ఆహారం, ధూమపానం, ఊబకాయం మొదలైన చెడు అలవాట్లు గుండె కవాటాల వ్యాధి ప్రమాదాన్ని పెంచుతాయి.

అధిక రక్తపోటు, మధుమేహం, ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా ఈ ప్రమాదాన్ని పెంచుతున్నాయి.

క్యాన్సర్ చికిత్స కూడా గుండెను ప్రభావితం చేస్తుంది.

గత దశాబ్దంలో ఈ వ్యాధులకు సంబంధించి పురోగతి వేగంగా అభివృద్ధి చెందుతుందని డాక్టర్ అంటున్నారు. సర్జికల్ వాల్వ్ రిపేర్, రిప్లేస్‌మెంట్ వంటి చికిత్స విధానాలు చాలా మంది ప్రాణాల్ని కాపాడుతున్నాయి. వృద్ధులు ? ఇన్వాసివ్ కాథెటర్ ఆధారిత చికిత్స ఫలితాల్ని మారుస్తున్నాయి. కాథెటర్ ఆధారిత మిట్రల్ వాల్వ్ చికిత్స కూడా వుంజుకుంటుంది. ఈ చికిత్స విధానాలు జీవిత నాణ్యతను మెరుగుపరుస్తున్నాయి.

అయితే, చాలా మందికి ఈ చికిత్సలు అందుబాటులో లేవు. అధిక ఖర్చులు, ఆలస్యమైన గుర్తింపు ప్రయోజానాల్ని పరిమితం చేస్తున్నాయి. చిన్న చిన్న పట్టణాల్లో చాలా మంది రోగులకు శస్త్రచికిత్స ఏకైక ఎంపికగా ఉంది. నాన్-కమ్యూనికబుల్ కోసం ప్రభుత్వ కార్యక్రమాలు అవగాహన కల్పిస్తున్నాయి.

ఇప్పటికీ గుండె కవాట వ్యాధుల మీద చాలా మందికి సరైన అవగాహన లేదు. బాల్యంలో వచ్చే ఇన్ఫెక్షన్లను ఈ జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. సమాధానం అధునాతన సాంకేతికతలో లేదు. సకాలంలో గుర్తించడంలో ఉంది. దీన్ని ముందుగానే గుర్తించడం వల్ల జీవిత నాణ్యత రెండూ మారవచ్చు

కాళ్ల నొప్పులు, పగుళ్లు ఇబ్బంది పెడుతున్నాయా,

మనంధరించే పాదరక్షలు కేవలం అందం కోసమే కాదు, పాదాల రక్షణ కోసం కూడాఅని గుర్తుంచుకోవాలి. చాలా మంది నడుస్తున్నప్పుడు లేదా నిలబడినప్పుడు పాదాల నొప్పులతో ఇబ్బంది పడుతుంటారు. ఇటువంటి ఇబ్బందులకు ప్రధాన కారణం తప్పుడు పాదరక్షలు ఎంచుకోవడమే.

చాలా మందిని వేధించే ప్రధాన సమస్య కాళ్ల పగుళ్లు. పగుళ్లు ఉన్నప్పుడు గాలి తగిలితే మంచిదని భావించి వెనుక భాగం తెరిచి ఉండే చెప్పులు వాడుతుంటారు. కానీ డాక్టర్ ప్రియాంక రెడ్డి అలా చేయవద్దని చెబుతున్నారు. కాళ్ల పగుళ్లు ఉన్నవారు వెనుక వైపు కవర్ చేయబడి ఉన్న సాండల్స్ లేదా షూస్ వాడటం వల్ల పాదం మీద ఒత్తిడి తగ్గుతుందని ఆమె వివరించారు. ఇటువంటి వారు వాడే పాదరక్షల సోల్ మరీ మెత్తగా లేదా మరీ గట్టిగా ఉండకూడదు. మధ్యస్థంగా ఉండి పాదానికి కుషన్ సపోర్ట్ ఇచ్చేలా ఉండాలి. ఫ్లిప్‌ఫ్లాప్స్, హై హీల్స్ వాడటం వల్ల పగుళ్లు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. కొందరికి పాదం అడుగు భాగం వంపు లేకుండా చదునుగా ఉంటుంది. దీనినే ఫ్లాట్ ఫుట్ అంటారు. వీరు సాధారణ చెప్పులు వాడితే పాదం అడుగున విపరీతమైన నొప్పి వస్తుంది. ఇటువంటి వారు ఖచ్చితంగా 'ఆర్చ్ సపోర్ట్' ఉన్న పాదరక్షలు ధరించాలి. నడకను నియంత్రించే 'మోషన్ కంట్రోల్' ఫీచర్ ఉన్న షూస్ వీరికి ఎంతో మేలు చేస్తాయి. మీరు ఇప్పటికే వాడుతున్న షూస్‌లో కూడా ప్రత్యేకంగా దొరికే ఆర్చ్ సపోర్ట్ స్లిప్-ఆన్స్‌ను అమర్చుకోవచ్చు. పాదాలకు ఎక్కువగా చెమట పట్టడం వల్ల దుర్వాసన రావడమే కాకుండా చర్మ వ్యాధులు సంభవించవచ్చు. ఇటువంటి సమస్య ఉన్నవారు గాలి ప్రసరణ బాగా ఉండే షూస్ ధరించాలి. తేమను పీల్చుకునే గుణం ఉన్న మెటీరియల్‌తో తయారైన పాదరక్షలు వీరికి ఉత్తమం. చెమటను అలాగే ఉంచే ప్లాస్టిక్, రబ్బర్ చెప్పులను వీలైనంత వరకు నివారించాలి. లేదంటే పాదాల వేళ్ల మధ్య ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.పాదాల వేళ్ల మధ్య దురద, పగుళ్లు ఉంటే అది ఫంగల్ ఇన్ఫెక్షన్ కావచ్చు. ఇలాంటప్పుడు మొదట చర్మ వ్యాధి నిపుణులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. చికిత్స సమయంలో పాదాలు తేమ లేకుండా పొడిగా ఉండాలి. అందుకే ఓపెన్ సాండల్స్ వాడటం మంచిది. ఇక ఆనెలు ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. బిగుతుగా ఉండే చెప్పులు వేసుకోవడం వల్ల పాదం మీద ఒత్తిడి పెరిగిఆనెలుతీవ్రమవుతాయి. పాదాలకు ఎక్కడా రాపిడి కలగకుండా ఉండేలా వెడల్పాటి ముందరి భాగం ఉన్న షూస్ ఎంచుకోవాలి.

కోలన్ క్యాన్సర్ రిస్క్‌ని తగ్గించే పండ్లు, రెగ్యులర్‌గా తింటే చాలా మంచిది

గట్ ఆరోగ్యాన్ని రక్షించుకోవడం మన మొత్తం ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుంది. సైన్స్ డైరెక్ట్‌లో ప్రచురించి ఒక అధ్యయనం ప్రకారం జనాభా పెరగడం, వృద్ధాప్యం, మానవ అభివృద్ధి కారణంగా 2040 లో ప్రపంచవ్యాప్తంగా 3.2 మిలియన్ల కొత్త కొలొరెక్టల్ క్యాన్సర్ కేసులు పెరిగే అవకాశం ఉందని అంచనా. ఆరోగ్యంగా జీవించడానికి.. మొదటి పునాది మన గట్ హెల్త్ అని చెప్పొచ్చు. అంటే జీర్ణవ్యవస్థ సరిగా పనిచేయడం. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే, మనం ప్రతిరోజూ తినే ఆహారం నేరుగా మన గట్ మైక్రోబయోమ్‌ను ప్రభావితం చేస్తుంది. ఇది శరీరంలో ఉండే "మంచి బ్యాక్టీరియా" సమూహం. ఈ మంచి బ్యాక్టీరియా ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ను తగ్గించి, కోలన్ క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి రక్షణనిస్తాయి. సైన్స్ డైరెక్ట్‌లో ప్రచురించి ఒక అధ్యయనం ప్రకారం జనాభా పెరగడం, వృద్ధాప్యం, మానవ అభివృద్ధి కారణంగా 2040 లో ప్రపంచవ్యాప్తంగా 3.2 మిలియన్ల కొత్త కొలొరెక్టల్ క్యాన్సర్ కేసులు పెరిగే అవకాశం ఉందని అంచనా.హార్వర్డ్‌లో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి మన పేగు ఆరోగ్యానికి మేలు చేసి కోలన్ క్యాన్సర్ ముప్పును తగ్గించే కొన్ని పండ్లను మనతో షేర్ చేసుకున్నారు. వాటిలో పోషకాలు, ఫైబర్ సమృద్ధిగా ఉండటమే కాదు, జీర్ణక్రియకు మద్దతు ఇచ్చే, ఇన్ఫ్లమేషన్ తగ్గించే, క్యాన్సర్ ముప్పును తగ్గించే సమ్మేళనాలు ఉంటాయి.

యాపిల్ పండ్లు తింటే : యాపిల్‌లోని పెక్టిన్ కంటెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పారు. ఇది గట్ బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేసే ఒక రకమైన కరిగే ఫైబర్. పెద్దప్రేగులో పులిసినప్పుడు.. పెక్టిన్ బ్యూటిరేట్ వంటి షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్‌లను (ఎఫఈంలు) ఉత్పత్తి చేస్తుంది, ఇవి పెద్దప్రేగు కణాలను క్యాన్సర్‌గా మారకుండా కాపాడతాయి.ఫ్రాంటియర్స్‌లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం ఆపిల్‌ను రోజూ తింటే ఆరోగ్యకరమైన గట్ హెల్త్‌కు మేలు చేస్తుంది. హానికరమైన బ్యాక్టీరియాను తగ్గిస్తుంది. మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ముఖ్యంగా యాపిల్ తొక్కల్లో క్వెర్సెటిన్ ఉంటుంది, ఇది కణాలలో ఆఔం నష్టాన్ని నివారించే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్.

కివి పండ్లలోని గుణాలు : పేగు ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో కివీ ఒకటి. దీనిలో ఆక్టినిడిన్ ఉంటుంది, ఇది ప్రోటీన్‌ను విచ్ఛిన్నం చేయడానికి సహాయపడే సహజ ఎంజైమ్ పరిశోధన ప్రకారం కివీ.. ప్రేగు క్రమబద్ధతను ప్రోత్సహిస్తుంది, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇవి పేగు క్యాన్సర్ రావడానికి ముఖ్య కారణాలు అని చెప్పొచ్చు. ఈ పండులో యాంటీఆక్సిడెంట్లు, ప్రీబయోటిక్‌ల ప్రత్యేక మిశ్రమం. పేగు గోడను బలోపేతం చేస్తాయి, ఇన్ఫ్లమేషన్ తగ్గిస్తాయి, క్యాన్సర్ ముప్పు తగ్గిస్తాయి.

సిట్రస్ పండ్లు : నారింజ, నిమ్మ, ద్రాక్షపండ్లు లాంటి సిట్రస్ పండ్లు రిఫ్రెషింగ్‌గా ఉండటమే కాదు. అవి నేచురల్ డీటాక్స్‌లా పనిచేస్తాయి. సిట్రస్ పండ్లలో ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి అధికంగా ఉంటాయని డాక్టర్ సేథి అన్నారు. ఇవి పేగుల్లో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి క్యాన్సర్‌కు ముఖ్యకారణం. ప్రచురించిన అధ్యయనం ప్రకారం సిట్రస్ పండ్లలోని హెస్పెరిడిన్, నరింగెనిన్ వంటి సమ్మేళనాలు పెద్దప్రేగులో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. దానికి మించి, సిట్రస్ పండ్లలోని కరిగే ఫైబర్ గట్ బాక్టీరియాను పోషిస్తుంది, సమతుల్య మైక్రోబయోమ్‌ను నిర్వహించడానికి సహాయపడుతుంది.

స్పోర్ట్స్ న్యూస్

ప్రపంచకప్‌లో వింత బౌలర్.. 'ధోనీ బయోపిక్'తో స్ఫూర్తి పొంది క్రికెట్ వైపు..!

భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్‌లో చిన్న జట్లు నేపాల్, యూఎస్ఏ అద్భుత పోరాట పటిమతో ఔరా అనిపిస్తున్నాయి. కొన్ని జట్లేమే ప్రధాన అస్త్రంగా కొత్త బౌలర్లతో బరిలోకి దిగుతున్నాయి. వీరిలో పాకిస్థాన్ స్పిన్నర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. అతడే ఉస్మాన్ తారీఖ్ తన వింత బౌలింగ్ యాక్షన్‌తో ప్రమాదకరమైన బౌలర్‌గా మారిన అతడికిస్ఫూర్తి ఎవరో తెలుసా?.. ఇంకెవరు మన మహేంద్ర సింగ్ ధోనీ అవును.. ధోనీ బయోపిక్ చూశాక క్రికెటర్ అవ్వాలని నిర్ణయించుకున్న తారీఖ్ ఇప్పుడు ప్రపంచకప్‌లో తన తికమక యాక్షన్‌తో వైరలవుతున్నాడు.ప్రపంచకప్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్లు, బౌలర్లు సంచలన ప్రదర్శనతో మ్యాచ్‌ను మలుపుతిప్పుతూ వార్తల్లో నిలుస్తుంటారు. కానీ, పదో సీజన్‌లో బౌలింగ్ యాక్షన్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది మాత్రం ఉమర్ తారీఖ్ ఒక్కడే. అవును.. అతడు బౌలింగ్ బంతిని త్రో చేసినట్టు? నేరుగా విసిరేసినట్టే ఉంటుంది. దాంతో.. బ్యాటర్లు 'ఇదేం బౌలింగ్ రా స్వామి.. బంతిని ఎప్పుడు విసురుతాడు? ఏ దిశలో వేస్తాడు?' అనే అంచనాకు రాలేక తలలు పట్టుకుంటున్నారు. శ్రీలంక దిగ్గజాలు ముత్తయ్య మురళీధరన్, అజంత మెండిస్, సునీల్ నరైన్(వెస్టిండీస్), వరుణ్ చక్రవర్తి(భారత్) వంటి వైవిధ్యమైన స్పిన్నర్లను చూశాం. కానీ, తారీఖ్ మాత్రం వీరికంటే ప్రత్యేకమని చెప్పాలి.అవ్వడానికి కారణం టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ. ఒకప్పుడు పాక్ జట్టులో అవకాశాల కోసం నిరీక్షించి విసిగెత్తిన అతడు దుబాయ్‌లో సేల్స్‌మెన్‌గా చేరాడు. ఒకరోజు అతడు ధోనీ బయోపిక్ చూశాక మళ్లీ తనలో ఆడాలనే ఉత్సాహం వచ్చిందని ఒకానొక సందర్భంలో సందర్భంలో అతడే స్వయంగా చెప్పాడు. స్పిన్ బౌలర్‌గా రాటుదేలిన అతడు ఇప్పుడు వరల్డ్‌కప్‌లో మిస్టరీ బౌలర్‌గా అవతరించాడు. తారీఖ్ యాక్షన్ చక్లింగ్.. అంటే నిబంధనల ప్రకారం చేతిని 15 డిగ్రీల కంటే ఎక్కువ దూరం తీసుకెళ్లకూడదు. కానీ, మనోడు మాత్రం అందుకు మినహాయింపు.ఎందుకో తెలుసా.. అతడికి అతడి కుడి చేయి నిర్మాణం సరిగా లేదు. ఇదే విషయంలో తారీఖ్‌కు ఊరట లభించింది. స్వదేశంలో పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్(ఖూఒ)లో క్వెట్టా గ్లాడియేటర్స్‌కు ఆడిన అతడు 5 మ్యాచుల్లో 10 వికెట్లు తీశాడు. అయితే.. ఆ లీగ్ సమయంలోనే రెండుసార్లు అతడి బౌలింగ్ యాక్షన్‌పై ఫిర్యాదులు వచ్చాయి. కానీ, అతడికి పాక్ బోర్డు క్లీన్‌చీట్ ఇచ్చింది. నిరుడు దక్షిణాఫ్రికాపై అరంగేట్రం చేసిన తారీఖ్ అత్యుత్తమ ప్రదర్శన 4/18.వరల్డ్‌కప్‌లో తమకు స్పిన్ అస్త్రంగా పనికొస్తాడని అతడిని ప్రపంచకప్ స్క్వాడ్‌లోకి తీసుకుంది పాక్. శ్రీలంక స్పిన్నర్లు ప్రభావం చూపుతారనే ఉద్దేశంతో అతడిని ఎంపిక చేశారు. తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై .. రెండో మ్యాచ్‌లో యూఎస్ఏ బ్యాటర్లను తికమక పెట్టి మూడు వికెట్లు తీశాడీ మిస్టరీ స్పిన్నర్. వివాదాస్పదంగా బౌలింగ్ చేస్తున్న తారీఖ్‌పై ఐసీసీకి ఇంకా ఫిర్యాదులు అందలేదు. ఒకవేళ ఎవరైనా అభ్యంతరం తెలిపితే.. అతడి బౌలింగ్‌ను పరీక్షించే అవకాశముంది.

పాకిస్థాన్ ఓవరాక్షన్ చేసింది.. ఉతికి ఆరేసిన హర్భజన్

టి-20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎంత చెప్పినా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తన నిర్ణయాన్ని మార్చుకోమని గట్టిగా వాదించింది. కానీ, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) చురకలు అంటించడంతో.. చివరకు పాక్ బోర్డు దిగి వచ్చింది. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు అంగీకరిస్తున్నట్లు యూటర్న్ తీసుకుంది. దీంతో మొదట నిర్ణయించినట్లు ఫిబ్రవరి 15న భారత్ వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతుంది.అయితే ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మాత్రం ఒప్పుకునే దానికి అంత హడావుడి చేయడం అవసరమా అని ఏకిపారేస్తున్నారు. టీం ఇండియా మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్ కూడా పాకిస్థాన్ వైఖరిపై విమర్శల వర్షం కురిపించాడు. రోజుకో కొత్త వేషం వేసుకుంటూ పాకిస్థాన్ ఓవరాక్షన్ చేసిందంటూ.. ఉతికి ఆరేశాడు. మ్యాచ్‌ను బహిస్కరిస్తున్నట్లు చెప్పిన పాక్.. ఇప్పుడు మళ్లీ ఎందుకు ఒప్పుకున్నట్లు అంటూ ప్రశ్నించాడు. అంతేకాక.. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్ మనుగడ సాధించలేదని అన్నాడు. ఆ విషయం పాక్‌కి తెలుసని.. అయినా కూడా బంగ్లాదేశ్ కోసం త్యాగాలు చేసినట్లు నటించిందని పేర్కొన్నాడు.ప్రతీ విషయంలో పాకిస్థాన్ భారత్‌పై ఆధారపడాల్సిందేనని.. కానీ, భారత్‌కు ఎన్నడూ పాకిస్థాన్‌పై ఆధారపడే పరిస్థితి రాదని హర్భజన్ అన్నాడు. పాకిస్థాన్ ఇలా యూటర్న్ తీసుకుంటుందని తనకు ముందే తెలుసని.. ఒకవేళ భారత్‌తో పాకిస్థాన్ మ్యాచ్ ఆడకపోతే పరిస్థితి వేరేలా ఉండేదని హెచ్చరించాడు. అప్పుడు ఐసిసి విధించే జరిమానాలకు.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని అన్నాడు.

బీసీసీఐ బిగ్ షాక్: కొత్త రూల్స్‌తో ఐదుగురు స్టార్లపై వేటు!

బీసీసీఐ తాజాగా 2025-2026 సీజన్‌కు సంబంధించి టీమిండియా ఆటగాళ్ల వార్షిక ఒప్పంద జాబితాను ప్రకటించింది. ఈ సారి సెలెక్షన్ కమిటీ అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. గతంలో ఒప్పందంలో ఉన్న ఐదుగురు ప్రముఖ ఆటగాళ్లను ఈ సారి పూర్తిగా పక్కన పెట్టింది. మొత్తం కాంట్రాక్ట్ పొందిన ఆటగాళ్ల సంఖ్యను 34 నుంచి 30కి తగ్గించడం ద్వారా కేవలం నిలకడగా రాణించే వారికి మాత్రమే జట్టులో చోటు ఉంటుందనే బలమైన సంకేతాన్ని పంపింది.ఈ జాబితాలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. స్టార్ పేసర్ మహ్మద్ షమీ, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ పేర్లు లేకపోవడం. గత ఏడాది 'గ్రేడ్ ఏ' కేటగిరీలో ఉన్న షమీ, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత టీమిండియా తరపున మళ్లీ మైదానంలోకి దిగలేదు. సుదీర్ఘ కాలంగా గాయాలతో సతమతమవుతూ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉండటమే అతడిని కాంట్రాక్ట్ నుంచి తొలగించడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు ఇషాన్ కిషన్ గత కొంతకాలంగా జట్టుకు అందుబాటులో లేకపోవడం, నిర్దిష్ట కాలంలో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడకపోవడంతో బీసీసీఐ అతడిపై మొండిచేయి చూపింది.దేశవాళీ క్రికెట్‌లో పరుగుల సునామీ సృష్టించి భారత జట్టులోకి అడుగుపెట్టిన సర్ఫరాజ్ ఖాన్ ఈసారి ఒప్పందాన్ని కోల్పోయాడు. తనకు లభించిన అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో సద్వినియోగం చేసుకోవడంలో అతను విఫలమయ్యాడని సెలెక్టర్లు భావిస్తున్నారు. ముఖ్యంగా న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో అతని పేలవ ప్రదర్శన వేటు పడటానికి కారణమైంది. అదేవిధంగా మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పటీదార్ కూడా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంలో విఫలం కావడంతో, అతడిని కూడా జాబితా నుంచి మినహాయించారు.గత సీజన్‌లో నిలకడగా అవకాశాలు పొందిన పేసర్ ముఖేష్ కుమార్ ఈసారి తన స్థానాన్ని కోల్పోయాడు. ప్రస్తుతం భారత జట్టులో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా వంటి యువ బౌలర్లు అద్భుతమైన ఫామ్‌లో ఉండటం, వేగంగా రాణిస్తుండటంతో ముఖేష్ కుమార్ వెనుకబడిపోయాడు. జట్టులో చోటు కోసం పోటీ తీవ్రంగా ఉండటం, యువ ఆటగాళ్ల మెరుగైన ప్రదర్శన ముఖేష్‌పై ప్రభావం చూపింది.ఈ కొత్త ఒప్పందాల ద్వారా బీసీసీఐ ఆటగాళ్లకు ఒక స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. సీనియారిటీ లేదా గత చరిత్ర కంటే.. ప్రస్తుత ఫామ్, ఫిట్‌నెస్, జట్టుకు అందుబాటులో ఉండటం మాత్రమే ప్రాధాన్యత అంశాలని తేల్చి చెప్పింది. "ఆడితేనే ఒప్పందం.. లేదంటే ఇంటికే" అనే ధోరణిని బీసీసీఐ ఈసారి గట్టిగా అమలు చేసింది. ఇది రాబోయే రోజుల్లో ఆటగాళ్ల మధ్య పోటీని మరింత పెంచే అవకాశం ఉంది.

టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ థ్రిల్లర్.. రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా

అహ్మదాబాద్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకున్నది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 రన్స్ తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఫస్ట్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. అహ్మదాబాద్ స్టేడియం బౌండరీల మోతతో హోరెత్తింది.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 187 రన్స్ చేసింది. క్వింటెన్ డికాక్ 59, రికల్టన్ 61 రన్స్ చేశారు. అయితే చేజింగ్ మొదలుపెట్టిన ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. అతను 42 బంతుల్లో 84 రన్స్ చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చెలరేగిపోయారు. దీంతో మ్యాచ్ ఆఫ్ఘన్ గెలుస్తుందనుకున్నారు. కానీ ఆఖరి ఓవర్లో 13 రన్స్ అవసరం కాగా .. మ్యాచ్ టై అయ్యింది. 19.4 ఓవర్లలో 187 రన్స్ చేసి ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లింది.ఇక ఫస్ట్ సూపర్ ఓవర్‌లో ముందుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్ చేసింది. ఆ ఓవర్‌లో 17 రన్స్ చేసింది ఆఫ్ఘనిస్తాన్. అజ్మతుల్లా 5 బంతుల్లో 16 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను అనూహ్య రీతిలో ఛేజ్ చేసింది దక్షిణాఫ్రికా. ఆఖరి బంతికి భారీ సిక్సర్ కొట్టిన స్టబ్స్ ఫస్ట్ సూపర్ ఓవర్‌ను తమ ఖాతాలో వేసుకున్నాడు.రెండో సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 రన్స్ చేసింది. స్టబ్స్ ఓ సిక్సర్ బాదగా, మిల్లర్ రెండు భారీ సిక్సర్లు కొట్టేశాడు. ఇక చేజింగ్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టి దక్షిణాఫ్రికాను వణికించాడు. కానీ ఆఖరి బంతికి క్యాచ్ అవుట్ కావడంతో 4 రన్స్ తేడాతో సఫారీలు విక్టరీ కొట్టారు.

ఆస్పత్రిలో అభిషేక్ శర్మ.. నమీబియాతో మ్యాచ్‌లో ఆడేది డౌటే !

ముంబై : ఇండియన్ ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఆస్పత్రి పాలయ్యారు. కడుపు ఇన్‌ఫెక్షన్ వల్ల అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో అతను టీ20 వరల్డ్‌కప్‌లో నమీబియాతో జరిగే మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉన్నది. గ్రూప్ స్టేజ్‌లో గురువారం నమీబియాతో మ్యాచ్ జరగాల్సి ఉన్నది. అయితే అమెరికాతో మ్యాచ్ జరగడానికి ముందు కూడా అతని ఆరోగ్యం సరిగా లేదని తెలిసింది. మ్యాచ్ ఆడిన తర్వాత అభిషేక్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలిసింది. అధిక ఉష్ణోగ్రతలతో అతను బాధపడ్డాడు. అమెరికాతో మ్యాచ్ ముందు అతనికి రిలీఫ్ మెడిసిన్ ఇచ్చారు.తాజాగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు అతను హాజరుకాలేదు. అభిషేక్‌కు ఇంకా కొన్ని ఉదర సమస్యలు ఉన్నాయని, మరో రెండు రోజుల్లో అతను అందుబాటులోకి వస్తాడని ఆశిస్తున్నట్లు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డొస్కెట్ తెలిపారు. అమెరికాతో మ్యాచ్‌లో అభిషేక్ డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత అతను ఫీల్డింగ్ చేసేందుకు క్రీజ్‌కు రాలేదు. ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఫీల్డింగ్ చేశాడు.ప్రస్తుతం ఢిల్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అభిషేక్ ఎప్పుడు డిశ్చార్జ్ అయ్యేది తెలియదని, అతను నమీబియాతో మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

పాకిస్థాన్ చివరకు సరైన నిర్ణయమే తీసుకుంది: గంగూలీ

ఐసిసి టి-20 ప్రపంచకప్‌లో భాగంగా ఈ నెల 15న భారత్‌తో జరగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తొలుత ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) మందలించడంతో పాక్ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని మ్యాచ్ ఆడేందుకు ఒప్పుకుంది. అయితే పాకిస్థాన్ ఈ యూటర్న్ తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ముందు బహిస్కరిస్తామని ఓవరాక్షన్ చేయడం ఎందుకు.. ఆ తర్వాత మళ్లీ యూటర్న్ తీసుకోవడం ఎందుకని పలువురు సీనియర్లు, నెటిజన్లు ఏకిపారేస్తున్నారు.తాజాగా ఈ విషయంపై బిసిసిఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ స్పందించారు. పాక్ చివరకు సరైన నిర్ణయమే తీసుకుందని ఆయన అన్నారు. రాజకీయాలు, క్రీడలు వేరన్న గంగూలీ.. భారత్‌ను ఓడించడం అంత తేలిక కాదని పేర్కొన్నారు. "చర్చల గురించి నాకు తెలియదు. కానీ, వాళ్లు భారత్‌తో ఆడుతామని మంచి నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాలు, క్రీడలు వేరు. భారత్, పాక్‌ల మ్యాచ్‌లు ఎప్పుడు ఆసక్తికరంగా ఉంటాయి. అయితే కొన్ని సంవత్సరాలుగా పాకిస్థాన్ పెద్దగా పోటీ ఇవ్వడం లేదు. భారత్ అద్భుతమైన జట్టు. టీం ఇండియాను ఓడించడం పాక్‌కు అంత తేలికైన విషయం కాదు" అని గంగూలీ అన్నారు.

పోర్టు రాకతో మచిలీపట్టణానికి మహర్దశ

విజయవాడ, ఫిబ్రవరి 11, (న్యూస్ పల్స్)మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జీవోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ఆ ప్రాంతాలు.. ఇక సూపర్

నెల్లూరు, ఫిబ్రవరి 11, రాష్ట్రంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు రైల్వే లైన్లను 4 వరుసలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మార్గంలో రైల్వే లైన్లు పెరగడం ద్వారా సరకు రవాణా వేగవంతంగా చేయవచ్చు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 774 రైల్వే లెవల్ క్రాసింగ్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీలను నిర్మించి, రైల్వే గేట్లు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. హైదరాబాద్-అమరావతి- చెన్నై, హైదరాబాద్-బెంగళూరు వంటి బుల్లెట్ రైలు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం వల్ల ఏపీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని సీఎం చంద్రబాబు దీమా వ్యక్తం చేశారు. రైల్వేతో పాటు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సైతం నిధుల కొరత ఉన్న కారణంగా, అందుకు అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ఫోకస్ చేయాలని సూచించారు. గడువులోగా భూములు సేకరించేందుకు ప్రయత్నించాలని, తమకు సంబంధం లేదు అనేలా కలెక్టర్లు వ్యవహరించకూడదని మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు సూచించారుప్రస్తుతం ఉత్పత్తుల రవాణా ఖర్చు సగటున 14 శాతంగా ఉందని, దీనిని 7 నుంచి 8 శాతానికి తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం 400 లక్షల టన్నుల ఉద్యాన పంటలు ఉత్పత్తి అవుతుండగా, రాబోయే ఐదేళ్లలో దీనిని 1,000 లక్షల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అనంతపురం నుంచి అరటిపండ్ల రవాణా తరహాలోనే అన్ని రకాల పంటల ఎగుమతుల కోసం మెరుగైన లాజిస్టిక్స్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే సీ ప్లేన్ల నిర్వహణలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలవబోతోందని చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని భారీగా తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం యూనిట్‌కు రూ. 5.18 ఉన్న వ్యయాన్ని ఎలాగైనా సరే రూ. 4 లోపు (రూ. 3.90) తీసుకురావడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, స్టోరేజీ, డిస్ట్రిబ్యూషన్ అన్నీ ఒకే దగ్గర ఉండేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ట్రూడౌన్ ద్వారా వినియోగదారుడికి ప్రయోజనం దక్కేలా చూస్తామన్నారు. గతంలో నీటి కొరత, విద్యుత్ కొరత అధికంగా ఉండేది. ఇప్పుడు వాటిని అధిగమించామన్నారు.పర్యావరణ హితం కోసం ఆర్టీసీలో 1,000 విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలాలు ఒక్క మీటరు పెరగడం ద్వారా మనకు రూ.4 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా, నిర్లక్ష్యం లేకుండా కలెక్టర్లు, అధికారులు పనిచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

ఒంగోలు నగర పాలక కౌన్సిల్ భేటి

హాజరయి ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు,ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది.నగరపాలక సంస్థ ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తో పాటు అధికార టీడీపీ, మిత్రపక్షం జనసేన, ప్రతిపక్ష వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.సమావేశానికి అవసరమైన కోరం సభ్యులు ఉండడంతో 130 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ నందు ప్రవేశ పెట్టారు.అజెండా లో ఒక అంశం మినహా అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.అజెండా లోని ప్రధాన అంశాలు అయిన ట్రంక్ రోడ్ విస్తరణ అంశం 3 తో పాటు మస్తాన్ దర్గా నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు గల రోడ్డు విస్తరణ పనులకు సంబందించిన అంశం 107 లకు సభ ఆమోదం తెలిపింది.పలు అంశాలకు చెందిన విషయాలపైన వైసిపి కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ కు టీడీపీ కార్పోరేట్లర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.నక్ష కార్యక్రమంలో పేరుతో ఇంటింటికి నంబర్ల వేసే కార్యక్రమానికి 20 లక్షల పనికి 80 లక్షలు కేటాయించడం ఏమిటని వైసీపీ సభ్యులు తమ అభ్యంతరాన్ని లేవనెత్తగా టీడీపీ కార్పొరేటర్లు దీటుగా బదులిచ్చారు.

వేటు కోసం కొలికపూడి నిరీక్షణ

విజయవాడ, ఫిబ్రవరి 11, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా గుర్తింపు పొంది, చంద్రబాబు నాయుడు నమ్మకంతో టికెట్ ఇచ్చి గెలిపించిన కొలికపూడి.. ప్రస్తుతం అదే పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటిస్తున్నారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొలికపూడి శ్రీనివాసరావు గత కొంతకాలంగా తన అసంతృప్తిని నేరుగా కాకుండా వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెట్టిన ఓ స్టేటస్ కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. 3 వారాల పాటు 35 గ్రామాల్లో 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను.. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలు.. పల్లె కన్నీరు పెడుతోంది అనే అర్థం వచ్చేలా ఆయన పోస్ట్ చేయడం, పరోక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి, విపక్ష వైసీపీ విమర్శించే తీరులోనే ఆయన పోస్ట్‌లు ఉండటం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది.కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీలోని కీలక నేతలను కూడా ఆయన టార్గెట్ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తన వద్ద టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత మొత్తం చెల్లించానని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తన ప్రమేయం లేదని, పేకాట క్లబ్‌లు నడిపేవారికి పదవులు ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు టీడీపీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి.కొలికపూడి వైఖరి చూస్తుంటే ఆయన వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ కేశినేని చిన్ని కూడా కొలికపూడిని వైసీపీ కోవర్టు గా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఆయన భేటీ అవ్వడం, వైసీపీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆయన త్వరలోనే కండువా మార్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ కోరింది. చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఆయనను హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కొలికపూడి మాత్రం తన తీరు మార్చుకోకపోగా, మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, అది తనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందని, సానుభూతి పొందే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన తన నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ, పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టేశారు. అలాగే టీడీపీ నుంచి కూడా ఆయనకు పిలుపులు రావడం లేదు. కొలికపూడి వ్యవహారం కేవలం ప్రజా సమస్యలకే పరిమితం కాలేదు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై ఆయన చేసిన ఆరోపణలు పార్టీలో భూకంపం సృష్టించాయి. టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత ఇచ్చానని ఆయన అనడం టీడీపీ క్రమశిక్షణను ప్రశ్నించేలా ఉంది. దీనికి ప్రతిగా ఎంపీ చిన్ని, కొలికపూడిని "వైసీపీ కోవర్టు"గా అభివర్ణించడంతో ఈ వివాదం వ్యక్తిగత

దూషణల స్థాయికి చేరుకుంది. నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, పేకాట క్లబ్ నిర్వాహకులకు పదవులు ఇస్తున్నారన్నది కొలికపూడి ప్రధాన ఆరోపణకొలికపూడి వైఖరిని గమనిస్తున్న విశ్లేషకులు దీని వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందని భావిస్తున్నారు. పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, దానిని 'దళిత నేతపై అణచివేత'గా చిత్రీకరించి సానుభూతి పొందాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో భేటీ కావడం, స్థానిక వైసీపీ నేతలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయన త్వరలోనే పార్టీ మారతారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టి సొంతంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక కేడర్‌ను నిర్మించుకోవాలని ఆయన చూస్తున్నారు.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ కొలికపూడికి నోటీసులు జారీ చేసింది. సాధారణంగా క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండే చంద్రబాబు, కొలికపూడి విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఒకవేళ ఆయనను సస్పెండ్ చేస్తే అమరావతి ఉద్యమ నేపథ్యం ఉన్న వ్యక్తిని పంపించేశారనే అపవాదు వస్తుందని, అలాగని వదిలేస్తే మిగిలిన నేతలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ ఆందోళన చెందుతోంది.మొత్తానికి, తిరువూరు ఎమ్మెల్యే వ్యవహారం టీడీపీలో ఒక 'ముల్లు'లా మారింది. అభివృద్ధి జరగడం లేదని ఆయన అంటున్న మాటలు వాస్తవమా లేక వ్యక్తిగత ప్రయోజనాల కోసం చేస్తున్న రచ్చా అన్నది పక్కన పెడితే, ఇది కూటమి ప్రభుత్వ ప్రతిష్టను మాత్రం దెబ్బతీస్తోంది. కొలికపూడి స్వయంగా తప్పుకుంటారా లేక పార్టీయే వేటు వేస్తుందా అన్నది వేచి చూడాలి.

వైసీపీ మౌనం – వ్యూహమా వైఫల్యమా

విజయవాడ, ఫిబ్రవరి 11, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడానికి సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మార్చి 9 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ తరుణంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పా అనుసరిస్తున్న మౌనం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న దాఖలాలు కనిపించకపోవడంతో, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించినట్లే.. ఇప్పుడు కూడా అదే బాటలో నడుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సూచనలు రాగానే అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంపై పార్టీలు కసరత్తు చేస్తాయి. కానీ వైసీపీలో ప్రస్తుతం అటువంటి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత క్యాడర్‌ను తిరిగి సమీకరించడంలో నాయకత్వం కొంత తడబడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార కూటమి దూకుడుగా ఉండటం, పోలీసులు , అధికార యంత్రాంగంపై తమకు నమ్మకం లేదని గతంలోనే పార్టీ ప్రకటించినందున , పోటీకి దూరంగా ఉండటమే మేలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందనేది ఒక వాదన అయితే, అది పార్టీ మనుగడకే ముప్పు అనే సంకేతాలు క్షేత్రస్థాయి నుంచి అందుతున్నాయి. స్థానిక ఎన్నికలు అంటే కేవలం పార్టీ గెలుపోటములే కాదు, గ్రామాల్లో నాయకులు తమ ఉనికిని కాపాడుకునే అవకాశం. ఒకవేళ పార్టీ పోటీ చేయకపోతే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా అనాథలయ్యే ప్రమాదం ఉంది. పోటీలో లేకపోతే క్యాడర్ నిరుత్సాహపడి, తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంది.రాజకీయాల్లో మైదానం వదిలి వెళ్లడం ఎప్పుడూ సరైన సంకేతం కాదు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ గ్రాఫ్ తగ్గుతూ వస్తోందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్న తరుణంలో, స్థానిక ఎన్నికల నుంచి తప్పుకోవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో ఓడినా పోరాడామనే ముద్ర ఉంటే భవిష్యత్తుపై ఆశ ఉంటుంది, కానీ పోటీనే చేయకపోతే పార్టీ బలహీనపడిందనే ముద్ర శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీ నుంచి వలసలను ప్రోత్సహించడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ యంత్రాంగాన్ని దెబ్బతీస్తుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. వైసీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఖండించి, కేడర్‌లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ అక్రమాలకు

పాల్పడుతోందని ఆరోపిస్తూనే, ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడం ద్వారానే కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చు. పరీక్షల లోపే ఎన్నికలు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు తగ్గట్టుగా, పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. లేనిప క్షంలో, ఈ స్థానిక ఎన్నికలు వైసీపీ ఉనికికి పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో, గ్రామ పంచాయతీల గడువు ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు రాగానే పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంతో సందడి నెలకొంటుంది. కానీ, వైసీపీ క్యాంపులో కనిపిస్తున్న నిశ్శబ్దం పలు అనుమానాలకు తావిస్తోందిగతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ పార్టీ నాయకత్వం అదే ఆలోచనలో ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు అనేక కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు, అధికార యంత్రాంగం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వరని వైసీపీ ఆరోపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇంకా కోలుకోలేదు. ఆర్థికంగా, సామాజికంగా దాడులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నికల బరిలోకి దిగడం సాహసమేనని కొందరు భావిస్తున్నారు. ఓడిపోతే వచ్చే పరాభవం కంటే, వ్యవస్థలపై నిరసనగా పోటీకి దూరంగా ఉన్నామని చెప్పడం ద్వారా పార్టీ పరువు కాపాడుకోవచ్చనేది కొందరి వాదన.రాజకీయాల్లో 'మైదానం వదిలి వెళ్లడం' అంటే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడమే. స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కావు, అవి పార్టీ గ్రామస్థాయి ఉనికిని చాటుకునే అవకాశం కల్పిస్తాయి. పార్టీ పోటీ చేయకపోతే దశాబ్దాలుగా జెండా మోసిన కార్యకర్తలు రాజకీయంగా అనాథలవుతారు. తమ ఉనికి కోసం వారు అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే ప్రమాదం ఉంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో, ఎన్నికల నుంచి తప్పుకుంటే పార్టీ పూర్తిగా బలహీనపడిందనే ముద్ర పడుతుంది. ఇది పార్టీ నుంచి భారీ వలసలకు దారితీసే అవకాశం ఉంది.రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. పోరాటం చేయకుండా తప్పుకోవడం వల్ల వైసీపీకి దీర్ఘకాలికంగా నష్టమే జరుగుతుంది. ఓడినా పోరాడామనే ముద్ర ఉంటేనే క్యాడర్‌లో భవిష్యత్తుపై ఆశ చిగురిస్తుంది. వైసీపీ నాయకత్వం అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూనే, ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలబడాలి .మార్చిలో జరగబోయే ఈ స్థానిక ఎన్నికలు వైసీపీకి ఒక "లిట్మస్ టెస్ట్" లాంటివి. ఈ పరీక్షలో పోటీ చేసి ఉనికిని చాటుకుంటుందో లేక బహిష్కరణ పేరుతో వెనకడుగు వేస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో వైసీపీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

ఆస్తి పన్ను బకాయిలుంటే ఆస్తులు సీజ్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, (న్యూస్ పల్స్)విశాఖపట్నంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ అధికారులు ఫోకస్ పెట్టారు. నగరంలో మొండి బకాయిలను వసూలు చేసేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి ముందుగా నోటీసులు ఇస్తున్నారు.. ఒకవేళ వారు స్పందించని పక్షంలో ఆస్తుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికి చెల్లించినవారికి ఊహించని షాకిస్తున్నారు.. ఆ ఆస్తుల్ని సీజ్ కూడా చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కఠినగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బకాయిలు ఒక్కొక్కటిగా వసూలవుతున్నాయివిశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తి పన్ను అసెస్‌మెంట్‌లు ఉంటే.. ఆ ఆర్థిక సంవత్సరంలో రూ.566.41 కోట్లు పన్ను రావాలి. అయితే ఇప్పటి వరకు రూ.360 కోట్లు మాత్రమే చెల్లించగా.. మిగిలిన మొండి బకాయిల్ని కూడా రాబట్టేందుకు సిద్ధమయ్యారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మొండి బకాయిలపై ఫోకస్ పెట్టారు.. ఆస్తి పన్ను బకాయి ఉన్నవారికి వరుసగా నోటీసులు జారీ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో లక్షా 36వేల 149మంది ఆస్తి పన్ను చెల్లించాల్సిన వారు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.. వీరందరికి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. వీరిలో లక్షా 10వేల 136మందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.. అయితే వీరిలో కూడా కొందరి నుంచి స్పందన రాలేదు. ఈ క్రమంలో వారి ఆస్తుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆ నోటీసులు పన్ను బకాయి వివరాలు ఉన్నాయి.. ఒకవేళ అప్పటికి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే.. వారి ఆస్తులను సీజ్ చేస్తున్నారు అధకారులు.ఇటీవల నగరంలోని ఓ సంస్థ మూడేళ్ల నుంచి రూ.87,74,916 పన్ను చెల్లించడం లేదు.. వారికి జప్తు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. ఈ క్రమంలో అధికారులు ఆ సంస్థ ముందు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే మరో సంస్థ ఏకంగా ఐదేళ్ల నుంచి పన్ను చెల్లించడంలేదు.. అక్కడ కూడా హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. మరో వ్యక్తి తొమ్మిదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించలేదు.. అక్కడ కూడా బోర్డు పెట్టారు. ఇలా బోర్డు పెట్టినా పన్ను చెల్లించనివారి ఆస్తుల్ని సీజ్ చేస్తున్నారు. ఈ తాజా పరిణామాలతో చాలామంది పన్నులు వసూలు చేస్తుండగా.. కొందరు మాత్రం వేచి చూసే ధోరణిలో ఉన్నారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నం జిల్లా తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా ఉంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సీఎం సోమవారం రోజు మంత్రులు, కార్యదర్శులలతో అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు.

కొరకరాని కొయ్యగా విష్ణుకుమార్ రాజు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, (న్యూస్ పల్స్)కూటమి ప్రభుత్వంలో విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కొరకరాని కొయ్యగా మారారు. ఆయన వ్యాఖ్యలు ప్రభుత్వంతో పాటు కూటమిని కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వరసగా ఆయన ప్రభుత్వానికి, కూటమికి వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లోకి బలంగా వెళుతున్నాయి. విష్ణుకుమార్ రాజు రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో బీజేపీ నుంచి గెలిచిన విష్ణుకుమార్ రాజు 2024 అంటే పదేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికయ్యారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆయన రూటు మారింది. గతంలో వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడిన విష్ణుకుమార్ రాజు ఇప్పుడు అధికార పక్షంలో ఉంటూ కూడా తాను ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు.విష్ణుకుమార్ రాజు కొంత ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉన్నందున ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారన్నకామెంట్స్ కూడా ఎక్కువగా వినపడుతున్నాయి. ఇటీవల రుషికొండ ప్యాలెస్ పై మంత్రి వర్గ ఉప సంఘం తీసుకున్న నిర్ణయాన్ని విష్ణుకుమార్ రాజు తప్పు పట్టారు. దానిని స్టార్ హోటల్ కు ఇస్తే సామాన్యులకు ఎలా ప్రవేశం దొరకుతుందని ఆయన సూటిగానే ప్రశ్నించి ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టారు. తర్వాత భోగాపురం ఎయిర్ పోర్టు లో ట్రయల్ రన్ పూర్తయిన సందర్భంగా కూడా విష్ణుకుమార్ రాజు వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే కంటే విశాఖ నుంచి విజయవాడకు వందేభార్ రైలులో వెళితే సమయం ఆదాఅవుతుందని చెప్పి ఇబ్బందిలోకి నెట్టారు. రైల్వే మంత్రికి విశాఖ నుంచి విజయవాడకు వందే భారత్ రైళ్లు వేయాలని తాను కోరతానని విష్ణుకుమార్ రాజు చెప్పారు.ఇక గూగుల్ డేటా



ఎరుపులో దిశా పటానీ కళాత్మక భంగిమలు

బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ వరుస ఫోటోషూట్లు వెబ్ లో సునామీ సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. నిమిషాల్లోనే లక్షలాదిగా ఫాలోవర్స్ దిశా ప్రతి పోస్ట్ కి స్పందిస్తుంటారు. ఈసారి కూడా అదే రెస్పాన్స్. లోఫర్ బ్యూటీ తన అద్భుతమైన ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌లో మరోసారి సెన్సేషన్ సృష్టించింది. ఈసారి ఎరుపు రంగు డిజైనర్ దుస్తుల్లో తాజా ఫోటోషూట్ ని పోస్ట్ చేసింది. తాజా ఫోటోలు అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ముఖ్యంగా ఎరుపు రంగు ఫ్లోరల్ టాప్, హాఫ్ షోల్డర్ లుక్ తో మతులు చెడగొడుతోంది. ఇక ఈ టాప్ ని కవర్ చేస్తూ, ఒక ఎరుపు రంగు కాంబినేషన్ చీరను దిశా ఆసరాగా చుట్టుకుని కనిపించింది. ఇక మెడలో కాంబినేషన్ కెంపులు, రత్నాలు పొదిగిన బంగారు ఆభరణాన్ని ధరించింది. దీనికి తెల్లని ముత్యాల అల్లిక అదనపు ఆకర్షణగా మారింది. దిశా అందాన్ని పదింతలు ఎక్కువగా ఎలివేట్ చేసింది ఈ హారం. ఎంపిక చేసుకున్న కాస్ట్యూమ్ కి తగ్గట్టే దిశా ఫోజులు కూడా వేడి పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. పంజాబీ గాయకుడితో ప్రేమాయణం? గత కొంతకాలంగా దిశా పటానీ, ప్రముఖ పంజాబీ గాయకుడు తల్వీందర్ ఒకరితో ఒకరు ప్రేమలో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే డేటింగ్ నిజమేనా? అని ప్రశ్నిస్తే, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తల్వీందర్ ఈ రూమర్లపై స్పందించారు. తామిద్దరం ప్రస్తుతం ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రక్రియలో ఉన్నామని, ఇప్పుడే ఏమీ చెప్పలేనని పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రేమలో పడుతుంటాను.. ప్రస్తుతం కూడా ప్రేమలో ఉన్నాను! అని హింట్ ఇచ్చేసాడు. దీంతో దిశా పటానీతో అతడు ప్రేమలో ఉన్నానని అంగీకరించినట్టేనని అభిమానులు భావిస్తున్నారు. ఇటీవల కృతి సనన్ సోదరి నుపూర్ సనన్ వివాహ వేడుకలో దిశా- తల్వీందర్ జంటగా కనిపించారు. అంతేకాకుండా, ముంబైలో జరిగిన పలు ఈవెంట్లలో చేతులు పట్టుకుని నడుస్తూ కెమెరా కంటికి చిక్కారు. ఇప్పటివరకు దిశా దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. దిశా ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. షాహిద్ కపూర్ సరసన దిశా పటానీ ఓ రోమియో అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఫిబ్రవరి 13న విడుదల కానుంది. ఇందులో 'జూలీ' అనే పాత్రలో దిశా కనిపించనుంది. చాలా కాలంగా చిత్రీకరణ లేక ఆలస్యమైపోయిన వెల్ కం టు ది జంగిల్ (వెల్ కం ఫ్రాంఛైజీ చిత్రం) త్వరలో రావాల్సి ఉంది. ఇది భారీ మల్టీస్టారర్. అలాగే ఆవారాపన్ 2 సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే దిశా పటానీ హాలీవుడ్ లో ప్రవేశిస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. హోలిగార్డ్స్ సాగా- ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే ఇంగ్లీష్ సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో మెరవబోతోంది. కల్కి 2898 ఏడి తర్వాత టాలీవుడ్ లో దిశా తదుపరి సినిమా గురించి ఇంకా వివరాలు వెల్లడి కాలేదు. తమిళంలోను కంగువ తర్వాత తన ప్రాజెక్ట్ గురించి ఎలాంటి ప్రకటనలు లేవు.

మెస్మరైజ్ చేస్తున్న భాగ్యశ్రీ!



కుర్రకారు క్రష్ గా మారిపోయిన భాగ్యశ్రీ బోర్సే ఈ మధ్యకాలంలో వరుస ప్రాజెక్టులలో బిజీగా మారుతూనే.. మరోవైపు తన అందాలతో ఎప్పటికప్పుడు లైమ్ లైట్ లో నిలుస్తోంది.. 1995 మే 6న మహారాష్ట్రలోని ఔరంగాబాద్ లో జన్మించిన ఈమె.. మోడల్గా తన కెరీర్ మొదలుపెట్టి ఆ తర్వాతే సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. 'యారియన్ 2' అనే చిత్రం ద్వారా హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈమె.. 2024లో హిందీ చిత్రమైన 'ఛాంపియన్' అనే సినిమాలో అతిథి పాత్ర పోషించి ప్రేక్షకులను పలకరించింది. 2024 లో హీరోయిన్గా ' మిస్టర్ బచ్చన్' సినిమాతో పూర్తిస్థాయి హీరోయిన్గా అవతరించి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ం ఇకపోతే మిస్టర్ బచ్చన్ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా ఉత్తమ మహిళ అరంగేట్రం కోసం సైమా అవార్డును కూడా దక్కించుకుంది. 2025లో గౌతం తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన కింగ్డమ్ సినిమాలో హీరోయిన్గా నటించి ఆకట్టుకున్న భాగ్యశ్రీ బోర్సే అదే ఏడాది రామ్ పోతినేని హీరోగా నటించిన ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో హీరోయిన్గా నటించింది. మహేష్ బాబు. పి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, వై రవిశంకర్ టీ- సిరీస్ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాతో భారీ విజయాన్ని అందుకుంటుంది అనుకున్నారు

అక్కడా మీనాక్షి పాదం మోపుతోందా?

హర్యానా బ్యూటీ మీనాక్షి చౌదరి ప్రతిభకు తగ్గ అవకాశాలు అందుకోవడంలో వెనుకబడుతోంది. చిన్న సినిమాతో నటిగా ప్రయాణం మొదలు పెట్టిన అమ్మడు అనతి కాలంలో స్టార్ హీరోలకు ప్రమోట్ అయినా? ఇంకా ఆస్టార్ లీగ్ లో మాత్రం చేరలేదు. సెకెండ్ లీడ్స్ లోనే కంటున్యూ అవుతోంది. వెనుక వంద కోట్ల క్లబ్ లో చేరిన చిత్రం ఉన్నా? ఛాన్సులు అందుకోవడంలో వెనుకబడిందంటే? అదృష్టం కలిసి రాకనే అనాలి. ఇటీవలే విడుదలైన 'అనగనగా ఒక రాజు'తోనూ మంచి విజయాన్ని అందుకుంది. సంక్రాంతికి రిలీజ్ అయిన సినిమా విమర్శకుల ప్రశంస లందుకుంది. మీనాక్షి పాత్రకు మంచి పేరొచ్చింది. కానీ అమ్మడి తాజా లైనప్ చూస్తే మాత్రం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం చేతిలో ఉంది 'వృషకర్మ' ఒక్కటే. ఇందులో యువ సామ్రాట్ నాగచైతన్యకు జోడీగా నటిస్తోంది. ఈ చిత్రం మినహా కొత్త ప్రాజెక్టే ఏది చేతిలో లేదు. ఈ సినిమా విజయం సాధించినా? వెంటనే మరో సినిమాకు సైన్ చేసే గ్యారెంటీ కూడా కనిపిం చడం లేదు. ఇవన్నీ అమ్మడు ముందుగానే గెస్ చేసిందో ఏమోగానీ తాజాగా మీనాక్షి చౌదరి ఫోకస్ శాండిల్ వుడ్ పై మళ్లించినట్లు కనిపిస్తోంది. కన్నడ స్టార్ రక్షిత్ హీరోగా నటించనున్న సినిమాలో హీరోయిన్ ఛాన్స్ అందుకుందని వార్తలొస్తున్నాయి. కిరణ్. రాజ్. కె ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. గతంలో ఇద్దరి కాంబినేషన్ లో రిలీజ్ అయిన '777చార్లీ' భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కన్నడలో మరో 100 కోట్లు రాబట్టిన చిత్రాల జాబితాలో చార్లీ నిలిచింది. ఈ నేపథ్యంలోనే రక్షిత్ తో మరోప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నాడు. ఇందులో హీరోయిన్ గా తొలుత కన్నడ నటినే తీసుకో వాలనుకున్నారు. కానీ మీనాక్షి చౌదరి ఆ పాత్రకు పర్ఫెక్ట్ గా సూటవ్వడంతో ఆమెని ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. మీనాక్షికి సరైన సమయంలో వస్తోన్న అవకాశం ఇది. ఇప్పటికే తెలుగు సహా తమిళ్ లో కూడా సినిమాలు చేసింది. కానీ కోలీవుడ్ లో కూడా బిజీ అవ్వలేదు. బాలీవుడ్ లో అదృష్టాన్ని ఆరంభంలోనే నిరూపించుకునే ప్రయత్నం చేసింది. 'అప్ స్టేర్స్' అనే చిత్రంతోనే చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. అటుపై బాలీవుడ్ లో అవకాశాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో టాలీవుడ్ పై దృష్టి పెట్టింది. ఇప్పుడిక్కాడా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ టంతో? కన్నడ మార్కెట్ లోకి ఎంటర్ అవుతుంది.

చైతూ స్ట్రాంగ్ ప్లాన్ ఇదేనా?

టాలీవుడ్ యంగ్ హీరో, యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య గురించి అందరికీ తెలిసిందే. నాగార్జున వారసుడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన చైతూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి వైవిధ్యమైన కాన్సెప్టులు ఎంచుకుంటూ.. డిఫరెంట్ స్టోరీలతో రూపొందే సినిమాలు చేస్తూ.. ఆకట్టుకుంటున్నారు. స్పెషల్ ఫ్యాన్ బేస్ కూడా క్రియేట్ చేసుకున్నారు. అయితే ప్రస్తుతం కెరీర్ లో 24వ మూవీగా వృష కర్మ చేస్తున్న నాగచైతన్య.. ల్యాండ్ మార్క్ 25వ మూవీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న వృష కర్మ షూటింగ్ చివరి దశలో ఉండగా.. నెక్స్ట్ మూవీపై చైతూ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఆ సినిమా ఎవరితో చేస్తారన్నది మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి అఫీషియల్ అనౌన్స్మెంట్ రాలేదు. కానీ సినీ వర్గాల్లో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే చైతూ 25వ మూవీ.. శివ నిర్వాణతో చేస్తారని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. స్టోరీని విన్నారని.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపించింది. అదే సమయంలో స్టార్ డైరెక్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీనుతో నాగచైతన్య తన ల్యాండ్ మార్క్ మూవీ చేస్తారని కొన్ని రోజుల పాటు ప్రచారం జరిగింది. ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయని గుసగుసలు వినిపించాయి

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.